

ప్రభుత్వ వైద్య కళాశాలకు మరో 9 పీజీ సీట్లు

• 56కు చేరిన సీట్ల సంఖ్య

- వివరాలు 6లో





మళ్లీ గండం!



రాపూరు : అభయారణ్యంలో దుముకుతున్న జలపాతం

నెల్లూరు : సండేమార్కెట్లో వర్షపునీరు

- రోజంతా వర్షం.. పడిపోయిన ఉష్ణోగ్రతలు
- వణికిపోతున్న జిల్లా ప్రజానీకం
- లోతట్టు ప్రాంతాల జలమయం
- నేడు కూడా మోస్తరు నుంచి భారీ వాన

6

నెల్లూరు (హరనాథపురం), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సరిగ్గా రెండు వారాల క్రితం మూడు రోజులపాటు కురిసిన వర్షంతో తీవ్ర ఇబ్బందులు పడ్డ జిల్లాప్రజానీకానికి ఇప్పుడూ అదే పరిస్థితి ఏర్పడింది. బంగాళాఖాతంలో వాయు'గండం' అంటేనే హడలిపోయే పరిస్థితి తలెత్తింది. తాజాగా వాయుగుండం ప్రభావంతో మంగళవారం ఉదయం నుంచి జిల్లావ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షం కురుస్తోంది. జిల్లాలో నగటు వర్షపాతం 5.7 మి.మీ, అత్యధికంగా నెల్లూరురూరల్‌లో 40.6, అత్యల్పంగా ఆత్మకూరు, ఏఎస్‌పేటలో 1 మి.మీ వర్షం కురిసింది. ముఖ్యంగా నెల్లూరు నగరంలో భారీ వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు, రోడ్లన్నీ జలమయం అయ్యాయి. అధికారుల అప్రమత్తతతో రైల్వే అండర్ బ్రిడ్జీలలో నీరు చేరినా తక్షణమే తొలగించారు. మురుగు కాలువ ల్లో చెత్తాచెదారం పేరుకుపోవ డంతో నీరు ముందు కు కదలక ఇళ్ల ముందు చేరిపోయాయి. బుధవారం కూడా జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం స్పష్టం చేడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్త మైంది.



నెల్లూరు : కరెంటాఫీస్ సెంటర్ సమీపంలో గతుకుల రోడ్డుపై వాహనదారులు, పాదచారులు

రామాయపట్నం పోర్టు అనుబంధ పరిశ్రమల ఏర్పాటు కోసం ఏపీ మారిటైమ్ బోర్డు చేపట్టిన భూ సేకరణ ప్రక్రియపై రైతుల్లో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో నిబంధనలు తోసిరాజని, ప్రజల అభ్యంతరాలను పక్కకు నెట్టి బలవంతంగా చేపట్టిన భూసేకరణ ప్రక్రియ ప్రస్తుతం కూడా అదేరీతిలో కొనసాగుతుండటంపై ఆందోళన వ్యక్తమవుతోంది. తమ అభ్యంతరాలకు అనుగుణంగా 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూములు తీసుకోవాలని కోరుతున్నా ఖాతరు చేయకుండా భూసేకరణ ప్రక్రియను అధికారులు కొనసాగిస్తున్నారు.

- కందుకూరు (ఆంధ్రజ్యోతి)

ఇచ్చి తీరాల్సిందే!

- రామాయపట్నం పోర్టు పరిసరాల్లో బలవంతపు భూసేకరణ
- ఏపీ మారిటైమ్ బోర్డు ద్వారా వెయ్యి ఎకరాల సేకరణ పూర్తి
- గ్రామాల్లో చక్రం తిప్పుతున్న దళారులు
- అభ్యంతరాలు బేఖాతరు.. నిబంధనలూ గాలికి
- అధికారుల తీరుపై రైతుల పెదవి విరుపు

రామాయపట్నం పోర్టు అనుబంధంగా పరిశ్రమల ఏర్పాటు కోసం గుడ్లూరు మండలం లోని చేవూరు, రావూరు, ఏలూరు పాడు గ్రామాల పరిధిలో 5,268 ఎకరాలు, కావలి రూరల్ మండలంలో 4411 ఎకరాలు సేకరించాలని గత వైసీపీ ప్రభుత్వం నిర్ణయించింది. తొలుత ఏపీఐఐసీ ద్వారా ఈ భూమిని సేకరించాలని ప్రయత్నిం చినా రైతుల నుంచి ఎదురవుతున్న ప్రతిఘటనను గుర్తించిన అప్పటి ప్రభుత్వం ఏపీ మారిటైమ్ బోర్డు ద్వారానే భూసేకరణకు శ్రీకారం చుట్టింది. ఏపీ మారిటైమ్ బోర్డుకు భూములు ఇవ్వాల్సిందేనని లేనిపక్షంలో భూసమీకరణ చట్టాన్ని ప్రయోగించి భూములు లాగేసుకుంటామని రైతులను హెచ్చరించింది. దీంతో ఆయా గ్రామాల రైతులు పలు వురు కోర్టులను ఆశ్రయించడమేగాక భూములు ఇచ్చేందుకు ససేమిరా అన్నారు. అయినా వివిధ రకాలుగా భూసేకరణ ప్రక్రియను ప్రారంభించి అప్పట్లోనే 300 ఎకరాలకుపైగా సేకరించారు. అయితే ప్రభుత్వం మారింది కనుక తమకు న్యాయం జరుగుతుందని ఆశించిన రైతులు ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోగా అదే పద్ధతిలో ప్రస్తుతం కూడా భూసేకరణ ప్రక్రియను కొనసాగిస్తూ వెయ్యి ఎకరాలకుపైగా భూమిని సేకరించారు.



ఏపీ మారిటైమ్ బోర్డు ద్వారా సేకరించదలచిన భూముల్లో ఉన్న మామిడిచెట్లు. ఈ తోటలు బహిరంగ మార్కెట్లో రూ.కోటి ధర పలుకుతుండగా 23 లక్షలకే సేకరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

• మార్కెట్ ధరకంటే తక్కువకు..

ఈ భూసేకరణ ప్రక్రియలో నిబంధలను పూర్తిగా పక్కనపెట్టేశారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం భూమి కోల్పోయే రైతుకు మార్కెట్ ధరకు నాలుగు రెట్లు పరిహారంగా ఇవ్వాలి. కానీ చేవూరు, రావూరు, ఏలూరుపాడు గ్రామాలలో ఈ నిబంధనను అమలు చేయటం లేదు. ఈ గ్రామాలలో సాధారణ భూముల ధర ఎకరం 7.70 లక్షలు మార్కెట్ ధరగా ఉంది. నిబంధ నల ప్రకారం ఎకరానికి రూ.30.8 లక్షలు పరిహారంగా ఇవ్వాలి. కానీ మార్కెట్ వాల్యూకి 1.25 రెట్లు మాత్రమే లెక్కించి ఆ మొత్తంకు సొలాషియంగా రెట్టింపు లెక్కించిన అధికారులు

- మిగతా 6లో

త్వరలో బీజేపీ సంస్థాగత ఎన్నికలు

• ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీ సంస్థాగత ఎన్నికలు త్వరలో నిర్వ హించనున్నట్లు పార్టీ కిసాన్ మోర్చా జాతీయ ఉపాధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ నన్నపురెడ్డి సురేష్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో ఆరు జిల్లాలకు పార్టీ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా తనకు బాధ్య తలు అప్పగించడం ఆనందంగా ఉందన్నారు. నెల్లూరులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం విలేకర్ల సమావేశంలో సురేష్‌రెడ్డి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అతిపెద్ద రాజకీయ పార్టీగా బీజేపీ అవతరించిందని చెప్పారు. పార్టీని మరింత బలోపేతం చేసి ఒక్కో పోలింగ్ బూత్‌కు ఇద్దరు క్రియాశీలక సభ్యులను నియమించి, క్షేత్రస్థాయిలో పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్తా మని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శీపారెడ్డి వంశీధర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి, ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భైరి శ్రీనివా సులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భరత్‌కుమార్ యాదవ్, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, నాయకులు మధు, మిడతల రమేష్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డెల్టాకు నీటి సరఫరా నిలుపుదల

అనంతసాగరం, నవంబరు 26 (ఆంధ్ర జ్యోతి): సోమశిల జలాశయం నుంచి పెన్నాడెల్టాకు నీటి సరఫరాను మంగళవారం ఆపినట్లు ఇంజనీర్లు తెలిపారు. ఎగువ నుంచి 5,181 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుం డగా, డ్యాంలో 70.602 టీఎంసీల నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. కండలేరుకు 2,500, ఉత్తర కాలువకు 700, దక్షిణ కాలువకు 400 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

• కండలేరులో..

రాపూరు (ఆంధ్రజ్యోతి) : కండలేరు డ్యాంలో 52 టీఎంసీల నీరు ఉన్నట్లు డ్యాం ఏఈ తిరుమలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. వాయుగుండం ప్రభావం వల్ల నీటి సామర్థ్యం మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ఇన్‌ఫ్లో ఏమీ లేకపోగా అవుట్ ఫ్లో మాత్రం 1760 క్యూసెక్కులు ఉన్నట్లు ఆయన తెలిపారు.



ఛ.. నిజంగా!

- ఆర్అండ్‌బీ అధికారుల ధైర్యం.. ప్రభుత్వానికి తప్పుడు నివేదికలు
- 25 శాతంలోపు జరిగిన వర్కుల రద్దుకు సర్కారు నిర్ణయం
- ఆ రోడ్ల వివరాలు పంపాలని ఉన్నతాధికారుల ఆదేశాలు
- ప్రారంభంకాని రోడ్లు కూడా 25 శాతం జరిగినట్లు నివేదికలు?
- క్షేత్రస్థాయిలో పనులు చేయించడంలో మాత్రం విఫలం
- ప్రయారిటీ వర్కుల మంజూరులో ప్రభుత్వానికి ఇబ్బందులు

ప్రభుత్వ ఆదేశాలనే ఆర్అండ్‌బీ అధికారులు ధిక్కరించారా? తప్పుడు నివేదికలతో ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నారా? ప్రారంభం కాని వర్కులు కూడా 25 శాతం పనులు జరిగినట్లు నివేదికలు ఇచ్చారా? అంటే విశ్వసనీయ వర్గాల నుంచి అవుననే సమాధానం వినిపిస్తోంది. ప్రభుత్వానికి అందజేసిన వర్కుల స్టేటస్ వివరాలను అడిగినా ఆ శాఖ అధికారులు బయటపెట్టక పోవడం ఈ అనుమానాలకు మరింత బలం చేకూరుతోంది. దెబ్బతిన్న రోడ్లను ప్రియారిటీ పద్ధతిలో బాగు చేయాలన్న కూటమి ప్రభుత్వ ఉన్నత లక్ష్యానికి జిల్లాలోని ఆర్అండ్‌బీ అధికారులు తూట్లు పొడుస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో పనిచేసిన అధికారులే ఇప్పుడూ అదే స్థానాల్లో ఉండటంతో ఆ ప్రభుత్వ పోకడలు ఇంకా కొందరు అధికారుల్లో పోలేదని ఆర్అండ్‌బీ వర్గాలే బహిరంగంగా చర్చించుకుంటున్నారు.

నెల్లూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లపాటు రోడ్లను పట్టించుకున్న నాథుడు లేడు. ఏ రోడ్డు చూసినా ఏమున్నది గర్వకారణం అన్న రీతిలో గుంతలమయంగా మారిపోయాయి. ప్రజల నుంచి విన్నపాలు అందినా.. చివరకు ఆగ్రహావేశాలు వ్యక్తమైనా రోడ్లకు మాత్రం మోక్షం కలగలేదు. పేరుకు మాత్రం ఏటా లెక్కకు మించి అనుమతులు ఇస్తూ వచ్చారు. వాటికి కాంట్రాక్టర్లు టెండర్లు వేయడం.. ఆ తర్వాత బిల్లులు ఇవ్వడం లేదన్న సాకుతో పనులు చేయకపోవడం గత ప్రభుత్వంలో పరిపాటిగా మారింది. 20 శాతం పనులు చేయడం.. ఆ తర్వాత బిల్లులు మంజూరుకాక కాంట్రాక్టర్లంతా కోర్టును ఆశ్రయించడంతో ఇప్పుడు కొన్ని వేల కేసులు హైకోర్టులో ఉన్నాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం పాలన మొదలయ్యాక దెబ్బతిన్న రోడ్లను బాగు చేసేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకుంది. ఒక వైపు పెండింగ్ బిల్లులను క్లియర్ చేస్తూనే మరో వైపు ప్రియారిటీ పద్ధతిలో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే బడ్జెట్‌కు మించి వర్కులను అనుమతులిచ్చి ఉండటంతో బాగా దెబ్బతిన్న రోడ్లకు కొత్తగా అనుమతులివ్వడం ఆర్థికపరంగా ఇబ్బందిగా మారింది. ఆ క్రమంలో గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా అనుమతులు ఇచ్చి, ఆ తర్వాత పనులు మొదలుపెట్టకుండా అలానే ఉన్న రోడ్ల వర్కులను రద్దు చేయాలని ఈ ఏడాది సెప్టెంబరులో నిర్ణయించింది. అసలు ప్రారంభం కాని వర్కులే కాకుండా 25 శాతం లోపు పనులు జరిగిన వర్కులను కూడా రద్దు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ జాబితాలో సీఆర్ఐఎఫ్, స్టేట్ హైవేస్, మేజర్ డిస్ట్రిక్ రోడ్లు ఉన్నాయి. నాబార్డ్ వర్కులు, కొన్ని కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యం ఉన్న వర్కులను ఇందులో మినహాయించారు.

• ఎందుకంత దాపరికం?

గత ప్రభుత్వంలో అనుమతులిచ్చి అసలు ప్రారంభం కాని వర్కులు, 25 శాతంలోపు పనులు జరిగిన వర్కులు జిల్లాలో రూ.వందల కోట్లలోనే ఉన్నాయి. ఒక్క సీఆర్ఐఎఫ్ కింద మంజూరై పనులు జరగనివి నెల్లూరు-పొదలకూరు-సైదాపురం రోడ్డు, నెల్లూరు-ముైపాడు రోడ్డు, గూడూరు-తురిమెర్ల రోడ్డు, కలిగిరి-ఓబులేటివారిపాలెం రోడ్లు ఉన్నాయి. వీటి విలువే సుమారు రూ.120 కోట్ల వరకూ ఉంటుంది. ఇక ఎస్‌హెచ్, ఎండీఆర్ రోడ్లు కూడా పదుల సంఖ్యలోనే ఉన్నాయి. వీటి విలువ మరో రూ.100 కోట్లపైగా ఉంటుందని అంచనా. వీటన్నిటికీ గడిచిన రెండేళ్లలో టెండర్లు పూర్తి చేసి ఉన్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌కు ముందు మంజూరైన ఇటువంటి వాటి జాబితాను అక్టోబరు 30వ తేదీలోపు పంపాలని ప్రభుత్వం నుంచి ఆర్అండ్‌బీ అధికారులకు ఆదేశాలు అందాయి. అయితే జిల్లా నుంచి ప్రభుత్వానికి తప్పుడు నివేదికలు వెళ్లినట్లు సమాచారం.

చాలా వర్కులు 25 శాతంలోపు పనులు జరిగి ఉన్నా అవన్నీ 25 శాతం పైన పనులు జరిగి నట్లు నివేదికల్లో చూపినట్లు తెలుస్తోంది. ఆఖరుకు అసలు ప్రారంభం కాని, రికార్డు కాని వర్కులను కూడా 25 శాతం పైన పనులు జరిగిన జాబితా లో చేర్చినట్లు ఆర్అండ్‌బీ వర్గాల ద్వారా తెలుస్తోంది. కొందరు అధికారులు ప్రభు త్వాన్ని తప్పుదారి పట్టిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రభు త్వానికి పంపిన వివరాలను ఇవ్వాలని ఆర్అండ్‌బీ అధికారు లను అడుగుతుంటే బయట పెట్టడం లేదు. ఎస్ఈ కార్యాల యంలో వివరాలు కోరగా నేరుగా ఈఈల స్థాయి నుంచే ప్రభుత్వానికి నివేదికలు వెళ్లిన ట్లు చెబుతున్నారు. ఈఈల కార్యాలయాల్లో వివరాలు కోరుతుంటే 'పరిస్థితులు అర్థం చేసుకోండి' అంటూ సమాధానాలు ఇస్తుండడం గమనార్హం. అధికారులు వాస్తవ వివరాలనే ప్రభుత్వానికి పంపి ఉంటే ఎందుకు ఆ వివరాలు ఇవ్వడానికి సముఖత చూడం లేదన్న ప్రశ్న తలెత్తుతోంది. జిల్లా నుంచి వెళ్లిన జాబితాను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే ఏ రోడ్డు పరిస్థితేమిటన్న వాస్త వాలు తెలుస్తాయని ఆ శాఖ వర్గాలు చెబుతున్నాయి.

• ఆ కాంట్రాక్టర్ల కోసమేనా..?

సాధారణంగా ఒక రోడ్డు వర్కు అగ్రిమెంట్ జరిగాక రెండేళ్లలో ఆ పని

- మిగతా 6లో

సంబరం



భారత రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా జరుపుకు న్నారు. ప్రభుత్వ కార్యాలయాలతోపాటు విద్యాసంస్థలు, ఇతర కార్యాలయాల్లో మహాత్మా గాంధీ, బీఆర్.అంబేడ్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కాగా, చేజర్లలోని లుంబిని విద్యాలయ విద్యార్థులు 300 అడుగుల జాతీయ పతాకంతో భారీ ర్యాలీ చేపట్టారు.

మద్యం దుకాణం వద్దే వద్దు

● జోరువానలోనూ నిరసన దీక్ష

నెల్లూరు (సాంస్కృతికం), (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని వాకర్స్ రోడ్డు పరమేశ్వరి నగర్ వద్ద ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలంటూ స్థానికులు చేపట్టిన ఆందోళన 22వ రోజుకు చేరింది. మంగళవారం జోరువానలోనూ నిరసన కొనసాగించారు. ఆ దుకాణాన్ని తొలగించమని జిల్లా ఉన్నతాధికారులు చెబుతున్నా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు.





ఇక్కడ పిల్లలు క్షేమమేనా?

లింగసముద్రం ఎంపీడీవో కార్యాలయం సమీపంలోని అంగన్‌వాడీకేంద్రం ఆవరణలో పిచ్చిమొక్కలు, ఇతర చెట్లు, చిల్లచెట్లు ఏపుగా పెరిగి అడవిని తలపిస్తోంది. ప్రతిరోజూ ఈ కేంద్రానికి చిన్నారులు, అంగన్‌వాడీ సిబ్బంది ఈ కేంద్రానికి వెళ్లాలంటే భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. దీని సమీపంలోనే ఉన్న పాడుబడిన నేలబావి నుంచి విషపురుగులు కేంద్రం ఆవరణలోకి వస్తున్నాయి. ఈ సమస్యతో పిల్లలను కేంద్రానికి పంపాలంటే తలిదండ్రులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

- లింగసముద్రం (ఆంధ్రజ్యోతి)

అల్లుకున్న నిర్లక్ష్యం

ఇళ్లముందు కరెంటు తీగలకు కాసింత ఎత్తులో ఉంటే చాలు చెట్లను తెగనరికే విద్యుత్ అధికారులు ఇదిగో ఈ చిత్రంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను అల్లుకుపోయిన తీగలను మాత్రం గాలికి వదిలేశారు. వలేటివారిపాలెం మండలంలోని అంకభూపాలపురం బస్‌షెల్టర్ నుంచి రామచంద్రాపురానికి వెళ్లే ప్రధాన రోడ్డులోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, స్తంభానికి పచ్చని తీగలు అల్లుకు న్నాయి. కండక్టర్ తీగలను సైతం తీగలు తాకుతుండడంతో విద్యుత్ సరఫరా అయ్యే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అల్లుకున్న పచ్చటి తీగలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

- వలేటివారిపాలెం (ఆంధ్రజ్యోతి)



ఇచ్చి తీరాల్సిందే!

(5వ పేజీ తరువాయి)

ఎకరానికి 23 లక్షలు మాత్రమే చెల్లించి భూములను లాగేసుకుంటున్నారు. అలాగే ఈ గ్రామాలలో రోడ్డు పక్క భూములు ఎకరం మార్కెట్ ధర రూ.18.8 లక్షలు ఉండగా నివాస స్థలాలకు అనువైన భూములైతే 31 లక్షలుగా మార్కెట్ ధర ఉంది. అయితే భూసేకరణ చట్టం నిబంధనలు పాటించకపోతుండటంతో రైతులు భూములు కోల్పోవటమేగాక కోట్ల రూపాయలు నష్టపోతున్న పరిస్థితి. ఇక ఈ గ్రామాలలో రిజిస్ట్రేషన్ శాఖ నిర్ణయించిన మార్కెట్ ధరలు ఇవి కాగా వాస్తవంగా భూముల ధరలు రోడ్డు వెంట అయితే కోటి నుంచి కోటిన్నర లోపల భూములైతే 50 లక్షలకు తక్కువ కాకుండా పలుకుతున్నాయి. ఈ తరుణంలో సగానికి సగం ధరకే తమ భూములను ఏపీ మారిటైమ్ బోర్డు లాగేసుకోవడంపై రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

● అభ్యంతరాలు పక్కకునెట్టి

నిబంధనలు పాటించని అధికారులు ఆయా గ్రామాల ప్రజల అభ్యంతరాలను కూడా పరిగణలోకి తీసుకోకుండా భూసేకరణ ప్రక్రియను కొనసాగిస్తున్నారు. మొత్తం భూములు తీసుకునే క్రమంలో భూసేకరణ చట్టం అమలుచేయటంతోపాటు తమ గ్రామాలను పునరావాస గ్రామాలుగా గుర్తించి ఆర్ఆర్ ప్యాకేజి అమలు చేయాలని, మరోచోట తమకు వ్యవసాయ భూములు చూపించి పునరావాస కాలనీలు నిర్మించాలని అప్పట్లో బాధిత రైతులు కోరారు. ఇదే అంశంపై హైకోర్టులో పిటీషన్లు కూడా దాఖలవగా విచారణ జరుగుతోంది. అయితే రైతుల అభ్యంతరాలు ఏమీ పట్టించుకోకుండా భూసేకరణ ప్రక్రియను అధికారులు యథావిధిగా కొనసాగిస్తుండటంపై రైతులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు.

● దళారులదే హవా

రైతుల అవసరాన్ని సొమ్ము చేసుకునేలా భూసేకరణ అధికారులు ప్రయత్నిస్తూ తమకు తీరని నష్టం చేయడమేగాక గ్రామాలలో మధ్యవర్తుల ద్వారా రైతులను ఒప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ మధ్యవర్తులు సన్న, చిన్నకారు రైతుల వద్ద ముడుపులు వసూలు చేస్తున్నారని, ఇప్పటికే కోట్ల రూపాయలు దళారులు వసూలు చేశారన్న విమర్శలు బాహాటంగా వినిపిస్తున్నాయి. ఈ వసూళ్లపర్వంపై చేవూరుకు చెందిన కొందరు రైతులు సోమవారం కందుకూరు సబ్ కలెక్టరు శ్రీపూజను కలిసి ఫిర్యాదు చేయటం విశేషం. ఈ వ్యవహారంపై గ్రామాలలో విచారిస్తే వాంగ్మూలాలు రైతులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని సబ్ కలెక్టరుకు వివరించారు.

మధ్యవర్తుల మాటే లేదు

పోర్టు అనుబంధ పరిశ్రమల కోసం భూసేకరణ ప్రక్రియలో మధ్యవర్తుల మాటేలేదు. భూసేకరణ కోసం అర్ధరాత్రి 12 గంటల వరకు కష్టపడుతున్నాము. రాత్రి కూడా 200 మంది రైతులు వచ్చి భూములు ఇచ్చేందుకు తమ సంసిద్ధత వ్యక్తంచేసి వెళ్లారు. అయినా ఇలా విమర్శలు చేయటం ఏమిటి.

- పద్మావతి, భూ సేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టరు

నిబంధనలు పాటించాలి

నిబంధనలు పాటించకుండా భూసేకరణ ప్రక్రియ కొనసాగిస్తుండటం శోచనీయం. బహిరంగ మార్కెట్లో యాభై లక్షలు పలికే భూములకు తక్కువ ధరకు లాగేసుకుంటున్నారు. మేము బయట మార్కెట్లో అమ్ముకునేందుకు లేకుండా రిజిస్ట్రేషన్లు నిలిపివేశారు. ప్రభుత్వం మారాక ఎమ్మెల్యేను కలిసి మాగోడు వినిపించగా న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు కానీ ఫలితం లేదు. మరోపక్క రైతులను చీల్చేందుకు ప్రభుత్వ అధికారులే గ్రామాలలో దళారులను పెట్టారు. వారు డబ్బు అవసరం ఉన్న రైతుల బలహీనతను గుర్తించి భూసేకరణ చేస్తున్నారు.

- సీహెచ్ శివప్రసాద్, చేవూరు రైతు

మళ్లీ గండం!

- రోజంతా వర్షం.. పడిపోయిన ఉష్ణోగ్రతలు
- వణికిపోతున్న జిల్లా ప్రజానీకం
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- నేడు కూడా మోస్తరు నుంచి భారీ వాన



నెల్లూరు : మాగుంట లే అవుట్లో..

నెల్లూరు (హరనాథపురం, సిటీ), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో మంగళవారం ఉదయం నుంచి నెల్లూరు జిల్లావ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షం కురుస్తోంది. జిల్లాలో మంగళవారం సగటు వర్షపాతం 5.7 మి.మీగా నమోదైంది. అత్యధికంగా నెల్లూరురూరల్‌లో 40.6, అత్యల్పంగా ఆత్మకూరు, ఏఎస్‌పేటలో 1 మి.మీ వర్షపాతం నమోదయ్యింది. నెల్లూరు అర్బన్‌లో 25.8 మి.మీ, కోవూరు 12.2, మనుబోలు 28, ఇందుకూరుపేట 26.4, పొదలకూరు 10.8, రాపూరు 1.2, ముత్తుకూరు 10.2, సైదాపురం 11.8, టీపీ గూడూరు 17.6, విడవలూరు 13.6, కొడవలూరు 8.4, కలువాయి 2.4, బుచ్చి 4.2, కావలి 2.8, బోగోలు 2.3, దగదర్తి 4.2, అల్లూరు 11, సంగం 1.6, చేజర్ల 1.2, అనంతసాగరంలో 1.2 మి.మీ వర్షం కురిసింది.

● నగరజీవనం అస్తవ్యస్తం

వాయుగుండం ప్రభావంతో నెల్లూరు నగరంలో రోజంతా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో నగరం లోని జనజీవనానికి తీవ్ర ఇబ్బం దులు ఏర్పడ్డాయి. దినసరి కూలీలు, చిరుద్యోగులు, రోడ్డుమార్జిన్ వ్యాపారులు, స్కూలు, కళాశాలల విద్యార్థులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. అండర్ గ్రౌండ్ బ్రిడ్జిల వద్ద వర్షపునీరు నిలవడంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు తప్పలేదు. ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ నిలిచిపోవడంతో అటు ప్రయాణికులు, వాహనదారులు అవస్థలు పడ్డారు. గాంధీబొమ్మ కూడలి వద్ద 30 మి.మీ వర్షం కురవగా, కార్పొరేషన్ కార్యాలయం వద్ద 28, మాగుంటలేఅవుట్‌లో 26, కొత్తూరు వద్దనున్న కరెంటాఫీసు కూడలిలో 22, గాంధీనగర్ వాటర్‌ట్యాంకు వద్ద 22.5, పీఎంఆర్ హైస్కూల్ వద్ద 17.5, మాదరాజుగూడూరు వద్ద 16 మి.మీ చొప్పున వర్షం కురిసింది. కాగ పగటిపూట ఉష్ణోగ్రతలు 23 డిగ్రీల కనిష్టానికి పడిపోవడంతో వృద్ధులు, చిన్నారులు ప్రతికూల వాతావరణంతో ఇబ్బందులు పడ్డారు.



ఇందుకూరుపేట : పోలీస్‌స్టేషన్ ముందు ఉధృతంగా ప్రవహిస్తున్న వర్షపునీరు

వర్షపు నీరు భారీగా నివాసాల వద్దకు చేరుతుందన్న సమాచారంతో కమిషనర్ సూర్యతేజ కార్పొరేషన్ యంత్రాంగంతో కలిసి శివారు ప్రాంతాలలో ఏర్పాట్లు పరిశీలించారు.

● పెంచలకోనలో కనువిందు

రాపూరు (ఆంధ్రజ్యోతి) : తెల్లవారు జామునుంచే ఎడతెరపి లేని వర్షం కురవడంతో పెంచలకోన క్షేత్రం ఆహ్లాదంగా మారింది. పచ్చని చెట్లతో నిండిన ఎత్తయిన కొండలను పొగమంచు కప్పేసింది. దానికితోడు బండరాళ్ల మధ్యలో నుంచి దుముకుతున్న జలపాతం పెంచలస్వామి భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.



నెల్లూరు : వేదాయపాళెం స్టేషన్‌లో పొగమంచులో రైలు



లోతట్టు ప్రాంతాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్ సూర్యతేజ

ప్రభుత్వ వైద్య కళాశాలకు

మరో 9 పీజీ సీట్లు

- 5 జనరల్ సర్జరీ, 4 ఆర్థోపెడిక్
- మొత్తం 56కు చేరిన సీట్ల సంఖ్య
- ఫలించిన ఎంపీ వేమిరెడ్డి కృషి



ఎన్ఎంసీ చైర్మన్ గంగాధర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న ఎంపీ వేమిరెడ్డి

నెల్లూరు (వైద్యం) నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలకు మరో 9 పీజీ సీట్లు కేటాయిస్తూ జాతీయ వైద్య కమిషన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు 47 పీజీ సీట్లు ఉండగా కొత్తగా జనరల్ సర్జరీ విభాగంలో 5, ఆర్థోపెడిక్ విభాగానికి 4 సీట్లు కేటాయించారు. దీంతో మొత్తం సీట్ల సంఖ్య 56కు చేరింది. కేంద్ర కుటుంబ ఆరోగ్య శాఖ మంత్రి ప్రకాష్‌నంద్‌తో వైద్య కళాశాలలో పీజీ సీట్లు అదనంగా కేటాయించాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి కోరారు. అలాగే నేషనల్ మెడికల్ కమిషన్ చైర్మన్ గంగాధర్‌తోనూ వేమిరెడ్డి గతంలో చర్చించారు. దీంతో ఎన్ఎంసీ బృందం నెల్లూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో పర్యటించి పరిశీలన చేపట్టి అదనపు సీట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై హర్షం వ్యక్తం చేస్తూ ఢిల్లీలో ఉన్న ఎన్ఎంసీ చైర్మన్ గంగాధర్‌ను ఎంపీ వేమిరెడ్డి కలిసి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిచేశారు. సీట్ల పెంపువల్ల యువ వైద్యులు అందుబాటులోకి వచ్చి పేదలకు మంచి వైద్యం అందిస్తారని అన్నారు. కాగా, పీజీ సీట్ల పెంపుపై కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగరాజ మన్నార్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మస్తాన్‌బాషా, డాక్టర్ నరేంద్ర, వైద్య విద్యార్థులు ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు.

శుద్ధిజల కేంద్రానికి మరమ్మతులు

ఉదయగిరి రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీ.చెర్లోపల్లి ప్రాథమిక పాఠశాలలో మరమ్మతులకు గురైన శుద్ధిజల కేంద్రానికి మంగళవారం మరమ్మతులు చేయించి విద్యార్థుల తాగునీటి కష్టాలు తీర్చారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో 'గుక్కెడు నీళ్లివ్వండి సార్' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన పాఠశాల హెచ్ఎం టీ.రమణయ్య, సీఆర్పీ మౌలాద్రి మెకానిక్‌తో శుద్ధిజల కేంద్రాన్ని బాగు చేయించి విద్యార్థుల తాగునీటి కష్టాలు తీర్చారు.



మరమ్మతులు చేసిన శుద్ధిజల కేంద్రం

ఛ.. నిజంగా!

(5వ పేజీ తరువాయి)

పూర్తి చేయాలి. సరైనా కారణం లేకుండా నిర్ణీత సమయంలోపు కాంట్రాక్టర్ పని మొదలుపెట్టకపోతే ఆ కాంట్రాక్టర్‌కు అధికారులు నోటీసులు జారీ చేయాలి. అయినప్పటికీ కాంట్రాక్టర్ స్పందించకపోతే ఆ కాంట్రాక్టర్ ఇచ్చిన బ్యాంకు గ్యారెంటీను సీజ్ చేయడంతోపాటు ఆ అగ్రిమెంటును రద్దు చేసి సదరు కాంట్రాక్టర్‌ను బ్లాక్‌లిస్టులో పెట్టే అధికారం ఆర్అండ్‌బీ అధికారులకు ఉంటుంది. కానీ జిల్లాలో రెండేళ్ల క్రితం అగ్రిమెంటు చేసుకున్న వర్కులు కూడా ఇప్పటికీ ముందుకు సాగడం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా వీటిల్లో కదలిక లేదు. అయితే చాలా మందికి అసలు ఆర్అండ్‌బీ అధికారులు నోటీసులే ఇవ్వలేదని సమాచారం. ఇప్పుడు ప్రభుత్వానికి వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ప్రారంభం కాని వర్కులు, 25 శాతంలోపు జరిగిన వర్కుల వివరాలు అందిస్తే ఆ తర్వాత ఎందుకు ఈ పనులు చేయించలేదన్నదానికి ఈ అధికారులే సమాధానం చెప్పుకోవాల్సి ఉంటుంది. ఆ కారణంగానే అధికారులు తప్పుడు నివేదికలు పంపి ఉంటా రన్న ప్రచారం జరుగుతోంది. అదే సమయంలో గత ప్రభుత్వంలో ఒకరిద్దరు కాంట్రాక్టర్లే వర్కులన్నింటినీ దక్కించుకుంటూ వచ్చారు. వీటిలో చాలా వరకూ ఎక్సెస్‌కే టెండర్లు దక్కించుకున్నారు. కాబట్టే ఈ వర్కులు రద్దు కాకుండా ఈ కాంట్రాక్టర్లు తెరవెనుక చక్రం తిప్పుతున్నారన్న ఆరోపణలున్నాయి. అదేసమయంలో వీరు కొన్ని వర్కులను లెస్‌కు దక్కించుకున్నారు. అటువంటి వర్కులను మాత్రం 25 శాతం కన్నా తక్కువ పనులు జరిగినట్లు చూపించి వాటిని రద్దు చేయించుకునే ప్రయత్నాలు జరుగుతున్నట్లు ప్రచారంజరుగుతోంది.

ఈఈలే నేరుగా పంపారు

ప్రారంభం కాని వర్కులు, 25 శాతం లోపు పనులు జరిగిన వర్కుల వివరాలు అందజేయాలని ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు అందాయి. ఈ వివరాలు అందించాలని ఆయా డివిజన్ల ఈఈలకు పంపాం. వారే ఆ వివరాలను నేరుగా ఉన్నతాధికారులకు పంపారు.

- ఎం గంగాధర, ఆర్అండ్‌బీ ఎస్ఈ

కుంచె కదిపితే

కళాఖండాలే!

- చిత్రలేఖనమే కాదు.. గాయకుడు, మిమిక్రీలో రాణింపు
- ఎన్నో అవార్డులు, ప్రశంసాపత్రాలు అందుకున్న సుదర్శన్





సుదర్శన్ గీసిన చిత్రాలు

ఆయన చేతి నుంచి ఎన్నో అద్భుత కళా ఖండాలు జాలువారి సజీవ చిత్రాలుగా నిలిచాయి. ఉదయగిరికి చెందిన యోసిపోగు సుందర్శన్ చేసేదే ఏపీఎస్ ఆర్టీసీలో కండక్టర్ ఉద్యోగమే అయినా ఇటు ఆర్టిస్టుగా అటు పాటలు పాడడం, ఫ్లూటు వాయించడం, మిమిక్రీలో ఆయనకు ఆయనే సాటిగా నిలుస్తున్నారు. అందుకే కాబోలు జిల్లా, రాష్ట్ర, దేశస్థాయిలో ఆయన ఎన్నో అవార్డులు, ప్రశంసాపత్రాలను అందుకున్నారు.

ఉదయగిరి రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : యేసిపోగు సుదర్శన్‌ది స్వగ్రామం బోగోలు మండలం బిట్రగుంట. తల్లిదండ్రులు రామచంద్రయ్య, రాజ్యలక్ష్మిల ప్రోత్సాహంతో డ్రాయింగ్ మాస్టర్ ఎస్.శంకరాచార్యులు వద్ద చిన్నప్పుడే బొమ్మలు గీయడం నేర్చుకున్నారు. చిత్రలు గీయడమేకాదు.. పాటలు పాడడం, ఫ్లూటు వాయించడం, మిమిక్రీ చేయడంలో దిట్ట. సుదర్శన్ చేతి నుంచి జాలువారే కళాఖండాలు సామాజిక పరిస్థితులను వివరించేలా ఉంటాయి. ఆనాటి భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే చిత్రాలతోపాటు అతను గీసిన రాధాకృష్ణులు, వెంకయ్యస్వామి, ఎన్టీఆర్, ఏపీజే అబ్దుల్‌కలాం, బాల సుబ్రహ్మణ్యం తదితర ముఖ్యుల చిత్రాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. వర్తమాన అంశాలను మేళవిస్తూ సుదర్శన్ గీసిన చిత్రాలు ఎన్నో అవార్డులు తెచ్చిపెట్టాయి. ఫ్లూటు, మిమిక్రీ ఆర్టిస్టుగా కూడా ఎన్నో అవార్డులతోపాటు సన్మానాలు అందుకున్నారు. ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్యనభ్యసించే వారికి పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించే చిత్రలేఖనం, మిమిక్రీ, పాటల పోటీల్లో సుదర్శన్ పాల్గొంటే ప్రథమ స్థానంలో నిలవాల్సిందే.



సుదర్శన్ అందుకున్న అవార్డులు, జ్ఞాపికలు

- 1987లో చిత్ర కళాప్రదర్శనలో రాష్ట్రస్థాయి ప్రథమ, ద్వితీయ బహుమతులను సుదర్శన్ సాధించారు.
- 1995లో దాసరి కళా నిలయం నిర్వహించిన పాటలు, మిమిక్రీ పోటీల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానం
- 2002లో తిరుపతిలో జరిగిన మిమిక్రీ పోటీల్లో రాష్ట్రస్థాయిలో ద్వితీయస్థానం
- 2003లో సింహపురి ఫైన్ ఆర్ట్స్ అకాడమీలో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్టిల్‌లైఫ్ పెయింటింగ్‌లో ద్వితీయస్థానం సాధించారు. అప్పటినుంచి 2016 వరకు సింహపురి ఫైన్ ఆర్ట్స్ నిర్వహించే పోటీల్లో బెస్ట్ ఆర్టిస్టు అవార్డు పొందాడు.
- 2013లో జాతీయ డ్రాయింగ్ కాంపిటేషన్‌లో బెస్ట్ ఆర్టిస్ట్ బహుమతి అందుకున్నారు.
- ఈ ఏడాది కళాకారుల దినోత్సవం సందర్భంగా సాగర్‌సేవా సమితి ఆధ్వర్యంలో సుదర్శన్‌ను సన్మానించి జ్ఞాపిక అందజేశారు.



కళాకారులను ప్రోత్సహించాలి

కళాకారులను ప్రతిఒక్కరు ప్రోత్సహంచాల్సిన అవసరం ఉంది. చారిత్రక ఘటనలకు చిత్రకళలు సజీవ సాక్ష్యాలు. ప్రస్తుతం సాంకేతిక పరి జ్ఞానం అందుబాటులోకి రావడంతో పలువురు అటువైపు అడుగులు వేస్తు న్నారు. నేను మాత్రం నాకు అబ్బిన చిత్రకళను పదిమందికి నేర్పుతున్నారు.

- సుదర్శన్, ఉదయగిరి

అబ్బో- రోడ్డు నాణ్యత ఎంత బావుందో ?!



గుంతలమయంగా మారిన సైదాపురం కైవల్యానది నుంచి రాపూరు క్రాస్‌రోడ్డు వరకు ఉన్న రహదారికి టీడీపీ ప్రభుత్వం వచ్చాక మరమ్మతులు చేపట్టింది. కాంట్రాక్టర్ నాసిరకంగా పనులు చేస్తున్న సమయంలో టీడీపీ నాయకులు రోడ్డును పరిశీలించి హెచ్చరించారు. కాగా రోడ్డు పూర్తయిన రెండు నెలలలోపే దెబ్బతింది. వర్షాలు కురుస్తుండడంతో నాసిరకంగా వేసిన రోడ్డు రంగు బయట పడింది.ఈ విషయమై మంత్రి నారాలోకేష్, కలెక్టర్ ఆనంద్, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ,ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారుల దృష్టికి టీడీపీ నేతలు తీసుకెళ్లారు. ఆర్‌అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తున్నదని టీడీపీ జిల్లా సీనియర్ నాయకుడు పీ శ్రీనివాస్ చౌదరి పేర్కొన్నారు. మంగళవారం ఆయన గుంతల రోడ్డును పరిశీలించారు. -సైదాపురం, (ఆంధ్రజ్యోతి)

నమ్మండి.. ఇది సిమెంటు రోడ్డేనండి !

ఈచిత్రంలో కనిపిస్తున్నది సిమెంట్ రోడ్డేనండి. ఉదయగిరిలో ఏవీధి చూసినా గుంతలపడిన, కంకరతేలిన, కుంగిన రోడ్లే దర్శనమిస్తాయి. దశాబ్దాల క్రితం నిర్మించిన రహదారులు కావడంతో ఈ పరిస్థితి నెలకొంది. వీటిపై రాకపోకలు సాగించేందుకు పాదాచారులేకాదు.. వాహనదారులూ హడలిపోతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో పల్లెపండుగలో భాగంగా ప్రతి పల్లెలోనూ సిమెంట్‌రోడ్ల నిర్మాణం జరుగుతోంది. అయితే ఉదయగిరికి ఒక్క రోడ్డు కూడా మంజూరు కాలేదు. ఈ విషయంలో అధికారుల తీరుపై పట్టణ ప్రజలు ఆగ్రహిస్తున్నారు.



-ఉదయగిరి రూరల్, (ఆంధ్రజ్యోతి)

అనంతసాగరం మండలం కామిరెడ్డిపాడు ఉన్నత పాఠశాలలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు ఎన్నికల నిర్వహణపై మాక్ పోలింగ్ నిర్వహించారు. సర్పంచి, ఉప సర్పంచి, వార్డు సభ్యుల ఎన్నికపై అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక గ్రంథాలయాధికారి ఆధ్వర్యంలో బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద విద్యార్థులు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వసుంధరాదేవి, గ్రంథపాలకుడు నారాయణరావు, జేవీవీ నాయకులు వేము పెంచలయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

- అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి)



ఎన్నికల నిర్వహణ ఇలా...!

సొంత చట్టాలొద్దు
మున్సిపల్ చట్టాన్ని అనుసరిస్తే చాలు

● అధికారుల సమీక్షలో రూరల్ ఎమ్మెల్యే చురకలు



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు(సిటీ), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా అమల్లో ఉన్న పురపాలక చట్టాన్నే నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోనూ అమలు చేస్తే సరిపోతుందని, ప్రత్యేకించి సొంత చట్టాలను అనుసరించాల్సిన అవసరం లేదంటూ రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అధికారులకు చురక అంటించారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ సూర్యతేజతో కలిసి అన్నీ విభాగాల అధికారులతో సమీక్ష జరిపారు. ఆస్తి పన్ను వసూళ్లలో మొండి బకాయిదారుల భవనాలకు కరెంట్, నీటి సరఫరా, డ్రైనేజీ వంటి వనరులను తొలగించడం సరికాదన్నారు. ఇలాంటి సొంత చట్టాలను ఉపయోగిస్తే తాను ఊరుకోనని స్పష్టం చేశారు. రోడ్డు మార్జిన్ వ్యాపారుల విషయంలో మానవతా దృక్పథంతో వ్యవహరించాలని కోరారు. ఇటీవల రెవెన్యూ విభాగంలోని ఆర్‌ఐ, ఆర్వోలను పారిశుధ్య విభాగానికి బదిలీ చేయడంపై ప్రశ్నించారు. శానిటేషన్ కోర్సు నేర్చుకోకుండా వారంతా ఆ విభాగంలో ఎలా పని చేస్తారని సున్నితంగా నిలదీశారు. దీనిని పునస్సమీక్షించాలని కమిషనర్‌కు సూచించారు. వీధిదీపాలను త్వరగా ఏర్పాటు చేయాలని, శివారు ప్రాంతాల్లో పందులు, కోతులు, కుక్కల బెడదను నివారించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఆసుపత్రికి పన్ను లేదు
భవంతికి అనుమతే లేదు!

● నెల్లూరు నగర పాలికలో వింతలు ● 'రెవెన్యూ, సిటీ ప్లానింగ్' అవినీతి లీలలు
● కమిషనర్ ఆకస్మిక తనిఖీలు ● ఆశ్చర్యపరుస్తున్న వాస్తవాలు
● రెవెన్యూ విభాగం ప్రక్షాళన

నెల్లూరు నగర పాలక సంస్థ రెవెన్యూ, సిటీ ప్లానింగ్ అధికారుల లీలలు ఉన్నతాధికారిని ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. నగరంలోని భవనాలు, వాణిజ్య కేంద్రాల నిర్మాణాలు, అనుమ తులు, వాటి పన్నులను పరిశీలించేందుకు కార్పొరేషన్ కమిషనర్ మల్లవరపు సూర్యతేజ కొద్ది రోజులుగా ఆకస్మిక తనిఖీలు చేస్తున్నారు. ఇందులో ఆయనకు మైండ్ బ్లాంక్ అయ్యే అంశాలు కంటపడుతున్నాయి. ఒక ప్రైవేటు ఆసుపత్రి భవనానికి ఆస్తిపన్నే లేదు, మరో వాణిజ్య భవన నిర్మాణానికి అసలు అనుమతులే లేవని తెలుసుకుని ఆశ్చర్యానికి గురయ్యారు. రెవెన్యూ, సిటీ ప్లానింగ్ అధికారులు మందలింపులతో మాట వినరని గ్రహించిన ఆయన తాజాగా రెవెన్యూ విభాగాన్ని మొత్తం ప్రక్షాళన చేశారు.

నెల్లూరు(సిటీ), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలోని అన్ని ఇళ్లు, వాణిజ్య, రెసిడెన్షియల్ భవనాల వాస్తవ కొలతలు, అనుమతులు, ఆస్తి పన్నులు తెలుసుకునేందుకు కార్పొరేషన్ యంత్రాంగం సర్వే చేస్తోంది. ఈ ప్రక్రియ పరిశీలనలో భాగంగా కమిషనర్ సూర్యతేజ ఆకస్మికంగా భవనాల వద్దకు వెళ్తున్నారు. ఇలా రెండు రోజుల క్రితం చిల్డ్రన్స్ పార్కు వద్దనున్న ఓ ప్రైవేట్ ఆసుపత్రి భవనాన్ని పరిశీలించారు. ఆస్తి పన్ను ఎంత వస్తోందని ప్రశ్నించగా ఆస్తిపన్నా...? అదేమిలేదే! అని భవన యజమానులు సమాధానమివ్వడం కమిషనర్‌ను విస్మయానికి గురిచేసింది. ఈ సంఘటనకు ముందు రోజు 19వ డివిజన్ గోమతినగర్‌లో కమిషనర్ పర్యటించారు. అక్కడి నాలుగు అంతస్తుల భవనాన్ని పరిశీలించి, దాని నిర్మాణ అనుమతులు చూపాలని యజమానులను కోరారు. అక్కడ తీసుకున్న అనుమతులు గోరంతైతే నిర్మాణం కొండంతుంది. ఆగ్రహించిన ఆయన వెంటనే మార్టిగేజ్ అంతస్తును సీజ్ చేశారు. ఇలా ఆకస్మిక తనిఖీలకు వెళ్తున్న ప్రతీ సారి అటు రెవెన్యూ, ఇటు సిటీప్లానింగ్ అధికారుల అవినీతి బహిర్గతం కావడంతో కమిషనర్ ఆశ్చర్యానికి లోనవుతున్నారు.



పన్ను విధించని ఆసుపత్రి భవనం వద్ద ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్న కమిషనర్ సూర్యతేజ (ఫైల్)

రెవెన్యూ ప్రక్షాళనతో సంకేతాలు

నగరంలోని పెద్ద పెద్ద భవనాలకు కూడా తక్కువ మొత్తంలో ఆస్తి పన్ను విధించి ఆర్వోలు, ఆర్‌ఐలు జేబులు నింపుకుంటున్నారనే ఆరోపణలు ఎప్పటి నుంచో వినిపిస్తున్నాయి. తాజాగా కమిషనర్ జరిపిన ఆకస్మిక తనిఖీల్లో ఇలాంటివి బహిర్గతం కావడంతో ఆర్వోలు, ఆర్‌ఐలు మందలింపులతో దారికి రావడం లేదని గ్రహించిన కమిషనర్ వేటుకు శ్రీకారం చుట్టారు. ఒకరిద్దరిని మార్చాలని తొలుత భావించినప్పటికీ అందరినీ మార్చేస్తే తప్ప రెవెన్యూ ప్రగతి చూపలేమని నిర్ణయించారు. ముగ్గురు ఆర్వోలు, 10 మంది ఆర్‌ఐలను ఏకకాలంలో బదిలీ చేసి వారందరినీ పనిష్మెంట్ కింద శానిటరీ విభాగానికి పంపారు. ఈ నిర్ణయం ఒక్క నెల్లూరు కార్పొరేషన్‌లోనే కాకుండా రాష్ట్రంలోని మిగిలిన కార్పొరేషన్లలోనూ చర్చనీయాంశంగా మారింది. ఇప్పటి వరకు రెవెన్యూలో ఇన్‌స్పెక్టర్లుగా పనిచేయని ఆరుగురిని గుర్తించి రెగ్యులర్ పోస్టులలో ఆర్‌ఐలుగా నియమించారు. ఆసుపత్రికి ఆస్తి పన్ను విధించనందుకు డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఆర్వో రాజేశ్వరి, ఆర్‌ఐ పద్మావతి, స్థానిక సచివాలయ అడ్మిన్ సతీష్‌కు షోకాజ్ నోటీసులివ్వడం గమనార్హం. ఇక, సిటీ ప్లానింగ్ విభాగాన్ని కూడా త్వరలో ప్రక్షాళన చేస్తారనే ప్రచారం జరుగుతోంది.

రాజ్యాంగ స్ఫూర్తితో
దేశాభివృద్ధికి కృషి చేయాలి

● రాజ్యాంగ దినోత్సవంలో జేసీ కార్తీక్




ఉద్యోగులతో రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేయిస్తున్న జేసీ కార్తీక్

నల్లూరు(హరనాథపురం), నవంబరు 26(ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ రాజ్యాంగ స్ఫూర్తితో దేశాభివృద్ధికి కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఈ దినోత్సవ ప్రాధాన్యతను వివరించి అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారత దేశం నిలబడిందంటే కారణం భారత రాజ్యాంగమేనని చెప్పారు. దేశ ప్రజలు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో జీవించడానికి రాజ్యాంగ పీఠికలో పేర్కొన్న అంశాలే ప్రధాన కారణమన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఉదయభాస్కర్, కలెక్టరేట్ ఏవో విజయకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణలో పోలీస్ పాత్ర కీలకం: ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైం), (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ పరిరక్షణలో పోలీసు శాఖ పాత్ర ముఖ్యమైనదని, పోలీసులు సమాజంలో బాధ్యతాయుతమైన సేవలు అందించాలని ఎస్పీ జీ కృష్ణకాంత్ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులు, విధులు, చట్టాలే ప్రజలకు రక్షణ అన్నారు. ఈ కార్యక్ర మంలో ఏఎస్పీ ఏఆర్ మునిరాజ, ఎస్‌బీ-1 ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, వెల్ఫేర్ ఆర్‌ఐ రాజారావు, హోంగార్డ్స్ ఆర్‌ఐ పాల్‌రాజ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటానికి సెల్యూట్ చేస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వృద్ధుడి మృతి

అల్లూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వృద్ధుడు (70) చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం మృతి చెందినట్లు, అల్లూరు పేట వీఆర్వో కుందుర్తి మనోహర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ కిషోర్‌బాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 20న పట్టణ పరిధిలోని వాటర్‌ట్యాంక్ ప్రాంతంలో అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. వారు అతన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని కుటుంబసభ్యుల గురించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చీటింగ్ కేసులో ఇద్దరి అరెస్ట్

నెల్లూరు రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు చేసి నగదు చెల్లించకుండా మోసం చేసిన కేసులో ఇద్దరు వ్యక్తులను మంగళ వారం అరెస్ట్ చేసినట్లు నెల్లూరు రూరల్ సీఐ జీ వేణు తెలిపారు. రూరల్ మండలం సౌత్‌మోపూరు గ్రామానికి చెందిన సతీష్ వద్ద అల్లీపురం పరిధి లోని సిరి గార్డెన్స్‌కు చెందిన మనోజ్, శ్రీనివాసులు రెడ్డి ధాన్యం కొనుగోలు చేశారు. అయితే సతీష్‌కు నగదు చెల్లించకపోవడంతో బాధితు డి ఫిర్యాదు మేరకు మనోజ్, శ్రీనివాసులురెడ్డిని అరెస్ట్ చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	102
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	190
స్కిన్‌లెస్	210
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7269
వెండి కిలో ధర	రూ. 90,700
వెండి ఒక గ్రాము	రూ.93.70

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళ ..

నెల్లూరు(క్రైం), (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ ప్రాంతం బుజబుజ నెల్లూరులో అక్రమంగా మద్యం విక్రయాలు సాగిస్తున్న రమణమ్మ అనే మహిళను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ నెల్లూరు-1 పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. నిందితురాలి నుంచి 9 మద్యం సీసాలను స్వాధీ నం చేసుకొని కేసు నమోదు చేశారు. దాడుల్లో ఎస్‌ఐ డీ శ్రీధర్, కానిస్టేబుల్ ఎం రాజాజీ, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గుంటూరు రేంజ్ సీఎఫ్ కాశీ విశ్వనాథరాజు, వేదికపై అటవీ శాఖ అధికారులు

గ్రామాల అభివృద్ధికి వీఎస్‌ఎస్‌లకు నిధులు

వచ్చిన ఆదాయంలో 50 శాతం ● గుంటూరు రేంజ్ సీఎఫ్ విశ్వనాథరాజు

నెల్లూరు (వెంకటేశ్వరపురం), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అటవీశాఖ ఆధ్వర్యంలో జరిగిన టేకుచెట్ల వేలం ద్వారా వచ్చిన ఆదాయంలో 50 శాతాన్ని వన సంరక్షణ సమితు(వీఎస్‌ఎస్)లకు కేటాయించనున్నట్లు గుంటూరు రేంజ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్(సీఎఫ్) కాశీ విశ్వనాథ రాజు తెలిపారు. జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో మంగళవారం నెల్లూరులోని ఓ కల్యాణ మండపంలో ఫారెస్ట్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ నెల్లూరు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎఫ్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన టెండర్లలో టేకు చెట్లకు టన్నుకు రూ.8100 అత్యధిక ధర పలికిందన్నారు. ఇందులో వచ్చిన ఆదాయంలో వీఎస్‌ఎస్‌ల ద్వారా వారి గ్రామాల అభివృద్ధికి 50 శాతం కేటాయిస్తామని ప్రకటించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్లాంటేషన్‌పై దృష్టి పెట్టాలన్నారు. అనంతరం నెల్లూరు నగర వనాన్ని సందర్శించారు. పెండింగ్ పనులు త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో టెరిటోరియల్ డీఎఫ్‌వో మహబూబ్ బాషా, సామాజిక వన విభాగం డీఎఫ్‌వో నాగార్జున రెడ్డి, స్క్వాడ్ డీఎఫ్‌వో మారుతీప్రసాద్, రేంజర్లు మాల్యాద్రి, రవీంద్రబాబు, శేఖర్, కుమార్‌రాజు, రామిరెడ్డి, వీఎస్‌ఎస్ సభ్యులు పాల్గొన్నారు.

ఇరుకళల పరమేశ్వరి సేవలో రామానంద భారతి



నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలాపేట ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయాన్ని మంగళవారం సౌభాగ్య భువనేశ్వరీ పీఠాధిపతి రామానందభారతీ స్వామి సందర్శించారు. ఆలయ ఈవో వీ గిరికృష్ణ, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం స్వామిజీ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో సాయిసదన్ ఛైర్మన్ శ్రీనివాసులురెడ్డి, ప్రధాన అర్చకుడు చంద్రస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్య చేసుకున్న యువకుడి గుర్తింపు

నెల్లూరు (క్రైం), నవంబరు 26(ఆంధ్రజ్యోతి) : నగరంలోని నక్కళోళ్ల సెంటర్ సమీపంలో సోమవారం ఆత్మహత్య చేసుకున్న యువకుడు రంగనాయకుల పేటకు చెందిన మోహన్(29)గా రైల్వే పోలీసులు గుర్తించారు. రైల్వే పోలీసుల సమాచారం మేరకు... రంగనాయకులపేటలో వెంకటేశ్వర్లు కుటుంబం నివసిస్తోంది. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు న్నారు. పెద్ద కుమారుడు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కాగా చిన్నకుమారుడు మోహన్ డిగ్రీ వరకు చదువుకొని తండ్రితోపాటు చిల్లర దుకాణం చూసుకుంటున్నాడు. అయితే మోహన్ కొంత కాలంగా మతిస్థిమితం సరిగా లేక నగరంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. అప్పుడప్పుడు ఇంటినుంచి వెళ్లిపోయి మరుసటి రోజు తిరిగి వచ్చేవారు. ఈ నేపథ్యంలో ఆదివారం తెల్లవారుజామున ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఉదయం 6గంటల ప్రాంతంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

లక్ష్యం.. వందశాతం ఫలితాల సాధనతో ఉండాలి

● వీఎస్‌యూ వీసీ విజయభాస్కర్ రావు
● కావలి పీజీ కళాశాలలో అంతర్‌కళాశాలల క్రీడా పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వీసీ విజయభాస్కర్‌రావు, రిజిస్ట్రార్ సునీత

కావలి టౌన్, నవంబరు 26: విద్యార్థులు విద్యా, క్రీడా, ఇతర ఏ రంగంలో అయినా 70, 80శాతం ఫలితాలతో సంతృప్తి పడి అక్కడితో ఆగకుండా వందశాతం ఫలితాల సాధన చేస్తే అనుకున్న లక్ష్యం చేరుకుంటారని విక్రమసింహపురి విశ్వవిద్యాలయం కులపతి ఎస్.విజయభాస్కర్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని వీఎస్‌యు పీజీ కళాశాలలో ప్రిన్సిపాల్ వీరారెడ్డి అధ్యతన ప్రారంభమైన అంతర్ కళాశాలల క్రీడాపోటీలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన వెంట రిజిస్ట్రార్ కె.సునీత, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ వెంకట్రాయులు ఉన్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడారు. అన్నిరంగాల్లో ఉన్నత శిఖరాలు అధిరోహించిన వారందరూ ఆకోవకు చెందినవారే అన్నారు. పోటీల్లో గెలిస్తేనే విజేతకాదని.. పాల్గొన్నవారందరూ విజేతలే అన్నారు. క్రీడాకారులు ఆల్ ఇండియా యూనివర్శిటీస్ పోటీలకు ఎంపికైతే పైస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఆర్థికంగా తోడ్పాటు అందిస్తామన్నారు. వన్‌టౌన్ ఎస్‌ఐ జమాల్ వలి, ఫైర్ ఆఫీసర్ సిద్ధార్థ, విశ్రాంత పీడీ ఆర్ మాల్యాద్రిలు ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొని క్రీడాకారులను ప్రోత్సహించారు. వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్, టగ్‌ఆఫ్ వార్ అంశాలలో పోటీలు జరిగాయి. బుధవారంతో పోటీలు ముగుస్తాయని ఆర్గనైజింగ్ సెక్రటరీ పీజీ కళాశాల పీడీ మణికంఠ తెలిపారు. పోటీల అబ్జర్వర్‌గా పీడీ ప్రసాద్‌రెడ్డి వ్యవహరించగా పీడీలు రవీంద్రబాబు, వెంకటేశ్వర్లు, ప్రవీణ్ పాల్గొన్నారు.

రైతాంగ సమస్యల పరిష్కారానికి పోరాడాలి

● రైతు సంఘాల సమాఖ్య రాష్ట్ర నేత కోటిరెడ్డి


నెల్లూరు (వైద్యం), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రైతాంగ సమస్యల పరిష్కారానికి రైతులంతా సంఘటితంగా పోరాడాల్సిన అవసరం ఉందని రైతు సంఘాల సమాఖ్య రాష్ట్ర నేత చిరసాని కోటిరెడ్డి అన్నారు. మంగళ వారం నెల్లూరులోని సండే మార్కెట్ యూనియన్ కార్యాలయంలో రైతు సంఘాల మహాసభల విశేషాలతో కూడిన సావనీర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 24 ఏళ్లుగా రైతులకు సంబంధించిన పలు సమస్యలు, పరిష్కారాలతో సావనీర్ విడుదల చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి గంగపట్నం రమణయ్య, రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయక కార్యదర్శి సునీత, జిల్లా అధ్యక్షుడు సుబ్బరాయుడు, జిల్లా సహాయక కార్యదర్శి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



సావనీర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

మోదీ విధానాలపై
ఉద్యమించండి

● ముడుపుల కేసులో జగన్‌పై కేసు పెట్టాలి
● సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

నెల్లూరు (వైద్యం), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని నరేంద్రమోదీ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు ఉద్యమించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం నెల్లూరులో ని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అమెరికాలో పారిశ్రామికవేత్త అదానీపై కేసు నమోదైతే ప్రధానిగానీ, కేంద్ర మంత్రులుగానీ మాట్లాడకపోవటం చూస్తుంటే ఎంతగా అదానీని వెనకేసుకొస్తున్నారో తెలుస్తుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు అదానీని విమర్శించే ధైర్యం కూడా చేయలేక పోతున్నారని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వంలో అదానీతో నాటి సీఎం జగన్మోహన్‌రెడ్డి కుదుర్చుకున్న ఒప్పందాల వల్ల రాష్ట్ర ప్రజలపై పెను భారం పడుతోందన్నారు. జగన్‌పై తక్షణం కేసు పెట్టాలని డిమాండ్ చేశారు. జగన్ హయాంలో ఇచ్చిన ఇంటి స్థలాలు ప్రస్తుతం నీట మునిగి ఉన్నాయని వాటన్నిటిని రద్దు చేసి, చంద్రబాబు ప్రభుత్వం కొత్త స్థలాలు ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, జిల్లా ఇన్‌చార్జి జగదీష్, నేతలు మాలకొండయ్య, అరిగెల సాయి, సయ్యద్ సిరాజ్ పాల్గొన్నారు.

నేటి నుంచి
పీజీ స్పాట్ అడ్మిషన్లు

నెల్లూరు(విద్య), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పీజీ కోర్సుల్లో మిగిలిన సీట్లను భర్తీచేసేందుకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ డీ గిరి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం నుంచి డిసెంబరు 2వతేదీ వరకు నేరుగా ప్రవేశాలు కల్పిస్తామని, విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పీజీ ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణులు కాకపోయినా ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో బుధవారం ఉదయం 10 గంటలకు కళాశాలలో హాజరు కావాలన్నారు.

ఉపయోగంలోకి తీసుకురండి



స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమీపంలోని మండల గృహ నిర్మాణశాఖ కార్యాలయం ఐదేళ్లుగా నిరుపయోగంగా ఉంది. అప్పటి నుండి మండల గృహ నిర్మాణశాఖ అధికారులు, సిబ్బంది స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని ఓ గదిలో విధులు నిర్వహిస్తున్నారు. 2013లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో మండల గృహ నిర్మాణశాఖ అధికారులకు, సిబ్బందికి ఈ కార్యాలయాన్ని నిర్మించారు. 2019 ఎన్నికల వరకు ఈ కార్యాలయం పని చేసింది. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత కార్యాలయం మూతపడింది. ఇటీవల కందుకూరు గృహ నిర్మాణ శాఖ డీఈ నారాయణరెడ్డి ఈ భవ నాన్ని పరిశీలించారు. దీన్ని వినియోగంలోకి తెచ్చి విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకో వాలని ఏఈ వెంకటేషన్‌ను ఆదేశించారు. పిచ్చి మొక్కలు తొలగించి మట్టి తోలించాలన్నారు.

- లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి)

ఉపయోగంలో లేని
సచివాలయ అనుబంధ భవనాలు

- దొంగలపాలవుతున్న ఫర్నిచర్, ఫ్యాన్లు, ట్యాబ్‌లు
- తమకెలాంటి సంబంధం లేదన్నట్టు వదిలేసిన అధికారులు

ఉలవపాడు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి):గ్రామ సచివాలయ వ్యవస్థకు అనుసంధానంగా ప్రవేశపెట్టిన రైతుసేవా కేంద్రం (గతంలో ఆర్‌బీకే), విలేజ్ హెల్త్ సెంటర్లు, మిల్క్ చిల్లింగ్ పాయింట్ కేంద్రాల నిర్వాహణకు నిర్మించిన భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. మండలంలో 16సచివాలయాలు ఉండగా ప్రతి సచివాలయానికి అనుబంధంగా లక్షలు ఖర్చుచేసి ఈ భవనాలను నిర్మించారు. కానీ ఎలాంటి ప్రభుత్వ కార్యకలాపాలు నిర్వహించకపోవడంతో స్థానికులకు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి. వీరేపల్లి, రామాయపట్నం, పెద్దపల్లెపాలెం సచివాల యాలలో రైతు సేవా కేంద్రాలు పూర్తి కావాల్సి ఉండగా మిగిలిన 13సచివాలయాల్లో అవసరమైన ఫర్నిచర్, ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేసి తాళాలు వేశారు. ఒక్కొక్క రైతుసేవా కేంద్రం నిర్మాణంకు రూ.23.50లక్షలు ఖర్చు చేశారు. హెల్త్ సెంటర్ల విషయానికొస్తె 16సచి వాలయాల్లో సగానికిపైగా పూర్తికాగా వీరేపల్లి, రామాయాపట్నం, పెద్దపట్టపు పాలెం, కరేడు-3 సచివాలయాల్లో అసంపూర్తిగా ఉన్నాయి. ఒక్కొక్క హెల్త్ సెంటర్ నిర్మాణం కోసం రూ.20.85లక్షలు వినియోగించారు. అదేవిధంగా మిల్క్ చిల్లింగ్ పాయింట్ కేంద్రాలు ఆత్మకూరు, పెద్దపట్టపుపాలెం తప్ప మిగతా 14సచివాలయాల్లో భవనాల నిర్మాణం పూర్తయింది. భవన నిర్మాణానికి రూ.17.67లక్షలు కేటాయించారు.



నిరుపయోగంగా ఉన్న కొల్లూరుపాడు హెల్త్ సెంటర్

రైతు సేవా కేంద్రాల ఫర్నిచర్‌కు దిక్కేదీ..

రైతుసేవా కేంద్రాల భవన నిర్మాణాలు పూర్తి చేసి ఫర్నిచర్, ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు కాంట్రాక్టర్లు అధికారులకు అప్పగించారు. అయితే వీటిని వినయోగించకపోవడంతో భీమవరం సచివాలయం-2లో దీపావళి రోజు రాత్రి తాళాలు పగలకొట్టి కుర్చీలు, ఫ్యాన్లు 4, ట్యాబు దొంగిలించారు. దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయిందనే విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

సంబంధంలేదని వదిలేసిన అధికారులు...

సచివాలయ వ్యవస్థ అనుబంధ కార్యాలయాల నిర్వహణ మాకేంటి సంబంధం అన్నట్లు మండల అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారు. వీటి నిర్వహణ బాధ్యత మండల పరిషత్ కార్యాలయం నిర్వహించాల్సి ఉండగా ఎంపీడీవో మాకు సంబంధం లేదన్నట్లుగా ఉండటం విశేషం.



భీమవరం సచివాలయం-2లో ఫ్యాన్ దొంగతనం కోసం బల్లలపై వేసిన కుర్చీలు

శిథిలావస్థలో ఎస్ఐ క్వార్టర్స్



మండలకేంద్రంలో లక్షలు ప్రభుత్వ ధనం వెచ్చించి నిర్మించిన సబ్‌ఇన్‌స్పెక్టర్ క్వార్టర్స్ వినియోగం లేక శిథిలావస్థకు చేరింది. భవనం కిటికీలు, తులుపులు చదులుపట్టి పోతున్నాయి. కిటికీల అద్దాలు పగిలిపోయాయి. భవనం చుట్టూ ముళ్ల చెట్లు కమ్మేశాయి. గతంలో పనిచేసిన ఇకరిద్దరు ఎస్‌ఐలు క్వార్టర్స్‌లో ఉండేవారు ఏడెనిమిదేళ్ల నుంచి ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐలు ఇక్కడ ఉండటం లేదు. క్వార్టర్స్‌లో నివాస ఉండడం లేదు. నిర్వాహణ పట్టించుకోకపోవడంతో లక్షలాది రూపాయలు ప్రభుత్వ నిధులు వృధా అయ్యాయి. అధికారులు స్పందించి క్వార్టర్స్‌ను వినియోగంలోకి తీసుకరావాలని ప్రజలు కోరుతున్నారు.

- వలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి)

ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలి

- సీఐటీయూ, ఏఐటీయూసీల ఆధ్వర్యంలో కార్మికుల ధర్నా, నిరసన ర్యాలీ

ఉదయగిరి రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను విడాలని మంగళవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రైతు సంఘం నాయకులు కాకు వెంకటయ్య మాట్లాడారు. అనంతరం తహసీల్దారు సుభద్రకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కాకు విజయమ్మ, సీపీఎం, సీఐటీయూ నాయకులు కోడె రమణయ్య, రజియా, గడ్డం నాగేశ్వరరావు, నాయబ్, మస్తాన్‌రెడ్డి పాల్గొన్నారు.

● ఆత్మకూరు, (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ, రైతుసంఘాలు, సీపీఎం నేతలు ఆర్డీవో కార్యాలయం వద్ద మహాధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు శివప్రసాద్, సీఐటీయూ నేతలు ఆత్మకూరు నాగయ్య, కొండమూరి హజరత్తయ్య, రైతుసంఘం నాయకులు లక్ష్మీపతి, సీపీఎం నేతలు డేవిడ్‌రాజు, అన్వర్‌బాషా, గుల్జార్‌బేగం పాల్గొన్నారు.

●కావలి టౌన్, (ఆంధ్రజ్యోతి): కేంద్రం చే పడుతున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధా నాలను నిరసిస్తూ కార్మిక సంఘాల నా యకులు, కార్యకర్తలు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ ఏరియా వైద్యశాల వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ ట్రంకురోడ్డు మీదుగా ఒంగోల్ బస్టాండ్ వరకు సాగింది. ఈ సందర్భంగా సీఐటీయూ నేత పెంచులయ్య, ఏఐటీయూసీ నేత చిన్ని రాజగోపాల్ మాట్లాడారు. ఉద్యమాలతో సాధించుకు 29కార్మికచట్టాలను రద్దు చేసి నాలుగు నల్ల చట్టాలను తెచ్చిందని మండిపడ్డారు. ప్రభుత్వరంగ సంస్థలకు నిధులు కేటాయించకుండా నిర్వీర్యం చేసి కార్పొరేట్ సంస్థలకు అప్పగించిందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం నాయకులు తాళ్ళూరు మాల్యాద్రి, రావి మాల్యాద్రి, దర్గాబాబు, రైతునాయకులు బలిజేపల్లి వెంక టేశ్వర్లు, గడ్డం మాల్యాద్రి, నాయకులు పోలయ్య, తురకా శీనయ్య, రమేష్, మల్లి అంకయ్య, ఆది నారాయణ, రావినూతల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● కందుకూరు, (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ, ఏఐటీయూసీల ఆధ్వర్యంలో నాయకులు, కార్మికులు కందుకూరు సబ్ కలెక్టరు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిం చారు.



కావలి: కార్మికుల సంఘాల నిరసన



ఆత్మకూరు: ధర్నా నిర్వహిస్తున్న రైతులు, కార్మికులు

అంతకుముందు వివిధ రంగాలకు చెందిన కార్మికులతో కలిసి పట్టణంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంక టేశ్వర్లు, ఏఐటీయూసీ నాయకులు జీవీబీ కుమార్, ఆనంద్ మోహన్, సల్మా, మురళీ, రామమూర్తి, మాదాల రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు ప్రణాళికతో పారిశుధ్య చర్యలు

- రవిచంద్రకుమార్, కలిగిరి కార్యదర్శి



కలిగిరి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి):పట్టణ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పారిశుధ్య చర్యలు చేపట్టడం, సకాలంలో తాగునీటి సరఫరా చేస్తామన్నారు. అలాగే సీసీరోడ్ల నిర్మాణం, ఇతర సౌకర్యాలను చేపట్టామన్నారు.

? పట్టణ జనాభా ఎంత.

! ప్రస్తుతం జనాభా ప్రస్తుతం 8,068 మంది ఉన్నారు.

? పారిశుధ్య కార్మికులు ఎం తమంది ఉన్నారు.

! 18మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. ఉదయం వేళలో వీధులు శుభ్రం చేయడం, డ్రైనేజీ పూడిక తీయడం, రాత్రి దోమల నిర్మూలనకు ఫాగింగ్ చేపడతాం.

? ప్రధాన సమస్య ఏది. పరిష్కార చర్యలేవి.

! ప్రధానంగా వర్షపునీరు ముందుకు పోకపోవడం. ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, పంచాయతీ అధికారులతో కలిసి మాస్టర్‌ప్లాన్‌తో అంతర్గతరోడ్లలోని కాలువలను, ప్రధాన కాలువకు కలిసేటట్టు చేసి నీరు ముందుకెళ్లేలా చర్యలు తీసుకుంటాం.

? స్వర్ణ పంచాయతీ కార్యక్రమం ఎంతవరకు వచ్చింది.

! గ్రామ సచివాలయ సిబ్బందితో స్వర్ణ పంచాయతీ సర్వే జరుగుతోంది. ఈ సర్వేలో కుటుంబ స్థితిగతులను తెలుసుకోవడం, ఇంటి నిర్మాణాల కొలతలు తీసుకోవడం, ఆన్‌లైన్‌లో కూడా పన్నులు వసూలు చేస్తాం.

? వందశాతం సీసీ నిర్మాణం చేపట్టారా.

! పంచాయతీ పరిధిలో ప్రస్తుతం 10.85 కి.మీ మేర సీసీ రోడ్లు వేశాం. మరో 4.2కిమీ అవసరమని ప్రతిపాదనలు పంపాం. ఉన్నతాధికారుల అనుమతి వస్తే అక్కడ వేస్తాం.

ఆధార్ లేకుంటే పథకాలు అందవు : సబ్ కలెక్టర్



వివరాలు అడుగుతున్న సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ

లింగసముద్రం,నవంబరు 26 (ఆంధ్రజ్యోతి):ప్రతిఒక్కరూ ఆధార్ తీయించుకోవాలని లేకపోతే ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు అందవని కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం లింగసముద్రం పంచాయతీ జంగంరెడ్డిపాలెం ఎస్టీ కాలనీని సబ్ కలెక్టర్ సందర్శించి స్థానికులతో మాట్లాడారు. ప్రతి పథకానికి ఆధార్ లింక్ అయినందువలన ఆధార్ తప్పనిసరి అన్నారు. ఈ సందర్భంగా ఆమె కాలనీలోని ప లువురు ఇళ్లకు వెళ్లి ఆధార్ గురించి ఆరా తీశారు. చాలామంది తమతో పాటు తమ చిన్నారులకు ఆధా ర్‌కార్డులు లేవని చెప్పారు. దీంతో ఆమె అధికారులు, సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. వారంరో జులలో ఆధార్ లేని వారిని గుర్తించి, వారందరికీ ఆధార్ తీయించాలని ఎంపీడీఓ కట్టా శ్రీనివాసులు, తహసీల్దార్ శ్రీనివాసులను ఆదేశించారు. ఎస్టీలు, అనాధలపై ప్రత్యేకదృష్టి పెట్టి ప్రత్యేక డ్రైవ్ ద్వారా వా రందరికీ ఆధార్ తీయిస్తామన్నారు. ఆధార్ తీసుకునేందుకు పుట్టినతేదీ ధృవపత్రాలు తహసీల్దార్ కార్యా లయంలో చాలా ఆలస్యం అవుతున్నాయని పలువురు సబ్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. అనంతరం ఆమె స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి నీటితీరువా వివరాలను త్వరాగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి మాధవరావు, వీఆర్ఓలు మస్తాన్ వలి, మౌనిక, రంగయ్య పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయండి: ఎమ్మెల్యే ఇంటూరి

ఉలవపాడు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ, మండలస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. అవసరమైన పనులు గుర్తించి అంచనాలు తయారు చేయాలని ఆదేశించారు. ఎంపీడీవో విజయ, తహసీల్దారు లావణ్యలతో మండలంలోని సమస్యలపై చర్చించారు. అనంతరం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంను సందర్శించారు.



అర్జీలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

● లింగసముద్రం, నవంబరు 26: రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ కట్టా శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన అధికారుల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ అవతరణ దినోత్సవం సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సర్పంచు నాగేశ్వరరావు, సోంపల్లి మనోహర్‌లు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు ఉన్నారు.

ముందస్తు చర్యలపై ఆర్డీవో సూచనలు

కావలిటౌన్, నవంబరు 26 (ఆంధ్రజజ్యోతి): తుఫాన్ విపత్తు నిర్వహణ ముందస్తు చర్యలపై మంగళవారం స్థానిక కార్యాలయంలో ఆర్డీవో వంశీకృష్ణ అన్నిశాఖల డివిజనల్‌స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించి సూచనలిచ్చారు. మత్స్యశాఖ అధికారులనడిగి తెలుసుకున్నారు.

గిరిజనులకు దుప్పట్ల పంపిణీ

కావలి టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ముసునూరు మర్రిచెట్టు గిరిజనకాలనీలోని గిరిజనులకు మంగళవారం వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు నాగరాజు గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేశారు. హ్యాపీ సే వాసంస్థ సభ్యులు గనీబాష, షేక్ మస్తాన్ సాహెబ్ దాతృత్వంతో ఈ కార్యక్రమం చేపట్టారు. వారివెంట మాలకొండారెడ్డి పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

సంగం, నవంబరు 26: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి పేర్కొన్నారు. మంగళవారం దువ్వూరు సెక్టార్ పరిధిలోని జండాదిబ్బ ఎస్టీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో బాల్య వివాహాల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

29న ఉదయగిరిలో జాబ్‌మేళా

ఉదయగిరి రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 29న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్.నారాయణస్వామి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 10వ తరగతి, ఐటీఐ, డిప్లమో చదివిన యువకులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కార్తీక వనభోజనాలు

వింజమూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక వింజేటమ్మ ఆలయంలో మంగళవారం కార్తీక వనభోజనం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉసిరిచెట్టు నాటారు. ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో కార్యదర్శులు, సిబ్బందికి సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్ర మంలో ఈవో శివకుమార్, గుండెమడగుల ఈవో శ్రీనివాసులురెడ్డి, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల సభ

కలువాయి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో మంగళవారం రాత్రి స్వర్ణోత్సవ మండల మహాసభ నిర్వహించారు. సీనియర్ నాయకులు చల్లా రఘురామిరెడ్డి, టీ.తిరుపాలు, ఎన్‌వీ.రమణారెడ్డి, ఎస్.రామచంద్రయ్య, యూవీ.రమణారావు, వీ.శ్రీనివాసులు, ఏ.మలికార్జునయ్య, ఎస్.రమణయ్య, ఎం.ఆంజనేయులు, కె.శ్రీనివాసులను శాలువాలతో సత్కరించారు. అనంతరం మండల యూటీఎఫ్ కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. గౌరవాధ్యక్షుడిగా శ్రీనివాసులు, అధ్యక్షుడిగా ఎస్.ఓబులేసు, సహాధ్యక్షుడిగా బి.శ్రీనివాసులు, కె.పెంచలమ్మ, ప్రధానకార్యదర్శిగా బీ.మస్తాన్‌బాబు, కోశాధికారిగా జీ.రాధాకృష్ణను ఎంపిక చేశారు.

నిందితుల హాజరుపై అవగాహన

వింజమూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నిందితుల అరెస్టు, రిమాండ్, కోర్టులో హాజరుపై ఉదయగిరి జూనియర్ సివిల్ కోర్టు ఏపీపీ ఎస్.సుకన్య మంగళవారం పోలీసులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉదయగిరి సీఐ వెంకట్రావు, దుత్తలూరు, సీతారాంపురం, వరికుంటపాడు, వింజమూరు ఎస్‌ఐలు, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఊరూరా రాజ్యాంగ దినోత్సవం

ఆత్మకూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం రాజ్యంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డిప్యూటీ డీఈవో గోపాల్, హెచ్ఎం కోటేశ్వరమ్మ, ఉపాధ్యాయులు అంబేడ్కర్‌కి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, చిత్రలేఖనం,వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పట్టణ ఆది ఆంధ్ర పాఠశాల లో జరిగిన కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ నేత వన్నెం నాగరాజు, మున్సిపల్ బస్టాండ్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.

● ఉదయగిరి రూరల్, (ఆంధ్రజ్యోతి): ఎంజీఆర్ ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో అసోసియేట్ డీన్ డాక్టర్ గోపీకృష్ణ, మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎల్.నారాయణ, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ కిరణ్, తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయాలు, సచివాలయాల్లో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● దుత్తలూరులో: తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు నాగరాజు, మండల వ్యవసాయాధికారి వెంకటసుబ్బారెడ్డిలు నివాళులర్పించారు.

● సంగం, (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల కార్యాలయంలో ఎంపీడీవో షాలెట్, తహసీల్దారు, గ్రంథాలయంలోనూ, మండలంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లోనూ అంబేడ్కర్‌కు నివాళులర్పించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఆయా కార్యాలయాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

● కలువాయి, (ఆంధ్రజ్యోతి): తెలుగురాయపురం ప్రాథమిక పాఠశాలలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళుర్పించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెచ్ఎం జీవీ.మురళీకృష్ణ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ మద్దు అమృత, టీచర్ ఆర్‌వీ.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

● సీతారామపురం, (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీపీయస్ (స్పెషల్) పాఠశాలలో హెడ్మాష్టర్ ఓంకారం రామకృష్ణంరాజు ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో రవిచంద్ర దేవరాజు, ముజీబు, ఖాజారంతుల్లా ఉన్నారు.

● వలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి): బడేవారిపాలెం ఎంపీపీ స్కూల్‌లో హెచ్ఎం వలేటి మాలకొండయ్య, ఉపాధ్యాయులు నివాళులర్పించారు.

● అల్లూరు, (ఆంధ్రజ్యోతి): పాతబస్టాండు కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు ఆధ్వర్యంలో సభ్యులు నివాళులర్పించారు. కార్యక్రమంలో ముసలి నరేంద్ర, పొంగులూరు సుధాకర్, వెంకటేష్, ప్రణయ్‌కుమార్ పాల్గొన్నారు.

● కొండాపురం (ఆంధ్రజ్యోతి): అన్ని, ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● కలిగిరి (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ నాయకులు పట్టణంలోని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు నందిపోగు వెంగళరావు, ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ , ఎంఎస్పీ నాయకులు రొడ్డా హజరత్, మస్తాన్, శ్యామ్యేలు, శ్రీనివాసులు, మహేష్ పాల్గొన్నారు.

● ఉలవపాడు(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ గారపాటి గోపీచంద్ ప్రకాష్ రాజ్యాంగం పీఠిక, అంబేద్కర్ చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. విద్యార్థులతో రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. ఆవశ్యకతపై నిర్వహించిన పోటీల విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు.

● కావలి టౌన్, (ఆంధ్రజ్యోతి): దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి ట్రంకురోడ్డులోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసినివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు సాయిప్రసాద్, దళిత నాయకులు చెరుకూరి జనార్దన్, ఎమ్మార్పీఎస్ నాయకులు జరుగుమల్లి రత్నం, చౌటూరి లక్ష్మయ్య పాల్గొన్నారు.

● వింజమూరు, (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీని వాస్‌రెడ్డి అధికారులు, సిబ్బందితో రాజ్యాంగ ప్రమాణం చేయించారు.

● లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి): స్థానిక సచివాలయం-1లో ఎంపీడీఓ శ్రీనివాసులు, సిబ్బంది నివాళులర్పించారు. పంచాయతీ కార్యాలయంలో సర్పంచు పులి రాఘవులు, మాజీ ఎంపీపీ బాలకోటయ్య, మాజీ సర్పంచు నాగేశ్వరరావు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసాచారి, సంధ్యారాణి, సుబ్రహ్మణ్యం, సీహెచ్ సాగర్, ఎంబాలు ఉన్నారు.

కావలి టౌన్, (ఆంధ్రజ్యోతి): బీజేపీ నాయకులు బ్రిడ్జి కూడలి ట్రంకు రోడ్డులోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బ్రహ్మానందం, నియోజకవర్గ కన్వీనర్ సీవీసీ సత్యం, అమరా సుబ్బారావు, కమల, కిరణ్ పాల్గొన్నారు.



ఉదయగిరి రూరల్: జూనియర్ కళాశాలలో..



కలిగిరి: అంబేద్కర్‌కి నివాళి



సంగంలో..

వీధి కుక్కలకు రేబిస్ టీకాలు



టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

కలిగిరి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): 'కుక్కల గుంపుపై ప్రజల ఆందోళన' అంటూ ఈ నెల 22న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ సురేష్‌బాబు స్పందించారు. పంచాయతీ కార్మికుల సహకారంతో ప్రత్యేక సిబ్బంది పర్యవేక్షణలో పట్టణంలోని వీధికుక్కలకు పిచ్చి ప్రబలకుండా సోమ, మంగళవారాలలో రాబిస్ టీకాలు వేయించారు. పట్టణ ప్రజలు తమ ఇళ్ల వద్ద ఉన్న పెంపుడు కుక్కలకు కూడా ముందస్తు జాగ్రత్తగా తప్పనిసరిగా టీకాలు వేయించాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శులు రవిచంద్ర, అశోక్ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

అల్లూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో తీరప్రాంతంలోని మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు లక్ష్మీ నారాయణ తెలిపారు. మం గళవారం ఆయన కార్యాలయ అధికారులతో ఫోన్ ద్వారా సంప్రదించి అవసరమైన చర్య లుపై ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రధానంగా నీటిపారుదల శాఖ, ఆర్ అండ్‌బీ, విద్యుత్ శాఖ, వ్యవసాయశాఖలను అప్రమ త్తం చేశారు. తుఫాన్ కారణంగా ఏవైనా సమస్యలు ఏర్పడితే సమాచారమివ్వాలన్నారు.

సైబర్ క్రైమ్‌పై అవగాహన

వింజమూరు (ఆంధ్రజ్యోతి) :పట్టణంలోని జడ్పీ హైస్కూల్‌లో మంగళ వారం ఎస్‌బీఐ మేనేజర్ రామకృష్ణ, హైస్కూల్ ఉపాధ్యాయులకు సైబర్‌క్రైమ్‌పై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయుల సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్ మ ధు, ఫీల్డ్ అసిస్టెంట్ బ్రహ్మయ్య పాల్గొన్నారు.

అధికారులంతా అప్రమత్తంగా ఉండండి

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురుస్తున్నందున అధికా రులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు వై.నాగరాజు తెలిపారు. మంగళవారం తహసీల్దారు కార్యాలయంలో మండల అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జలవనరులు, ఆర్‌అండ్‌బీ శాఖాధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శులు పంచాయతీల్లో ప్రజలకు అం దుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఉదయగిరి రూరల్ : అధికారులతో సమీక్షిస్తున్న తహసీల్దారు

● అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి): తుఫాన్ వర్షాలతో ప్రజలు అపమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం కార్యదర్శులతో ప్రతేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో మస్తాన్, హౌసింగ్ ఏఈ శరత్ పాల్గొన్నారు.

● సంగం, (ఆంధ్రజ్యోతి): తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు సోమ్లానాయక్ తుఫాన్‌పై ముందస్తుగా తీసుకోవాలసిన జాగ్రత్తలపై అధికారులతో సమీక్షించారు.

● బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి): అధికారులు గ్రామ పంచాయతీలో ప్రజలకు అందుబాటులో ఉండాలని తహసీల్దారు సురేష్‌బాబు తెలిపారు. స్థానిక మండల కార్యాలయంలో మండలాధికారులతో సమావేశం అయ్యారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడి తుఫాన్‌గా మారే అవకాశాలు ఉన్నాయని లోతట్టు ప్రాంతప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్రమణ్యం, డిప్యూటీ తహసీల్దారు భరత్‌కుమార్, ఏఈ పీఆర్ శ్రీనివాసులు, ఏవో విజయలక్ష్మీ, ఎంఈవో నరసింహరావు, ఇరిగేషన్ ఏఈ జితేంద్ర రెడ్డి, వైద్యాధికారి ప్రవీన్‌కుమార్, సూపర్‌వైజర్ సుభాషిణి ఉన్నారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన పారిశ్రామికవేత్తలు

వింజమూరు, నవంబరు 26 (ఆంధ్ర జ్యోతి): ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పిలుపుమేరకు అమెరికాలోని ర్యాలై, నార్త్ కరోలినా ప్రాంతాలకు చెందిన పారిశ్రామికవేత్తలు విమల్ కుమార్ కొలప్ప, సాయికిరణ్ కొలవెన్నులు ఉదయగిరిలో పెట్టుబడులు పెట్టేందుకు ఇటీవల నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. అనంతరం వారు మం గళవారం అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిశారు. వారి వెంట ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కూడా ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ ఆగ్రోఫామ్స్ ఏర్పాటుకు అన్ని విధాలా సహకరిస్తానని హామీ ఇచ్చారు.



పారిశ్రామికవేత్తలతో ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే కాకర్ల

మేలైన యాజమాన్యంతో అధిక దిగుబడులు

ఆత్మకూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతులు వరిసాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి, అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ సహాయ ఉపసంచాలకులు దేవసేనమ్మ తెలిపారు. మురగళ్ల, వెంకట్రావుపల్లిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఉద్యానశాఖాధికారి రాజశేఖర్, వ్యవసాయ సహాయకులు స్వప్న, ఎంపీఈవో ఇంద్రాణి పాల్గొన్నారు.

● వలేటివారిపాలెం: డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకురాలు అనసూయ పోలి నేనిపాలెం, కూనిపాలెంలో నిర్వహించిన పొలంపిలుస్తోందిలో ఏఓ హేమంత్ భరత్‌కుమార్, పోకూరు పశువైద్యాధికారి పులివంశీ, పోలినేనిపాలెం ఎంపీటీసీ చింతలపూడి రవీంద్ర, సర్పంచ్ అమరేశ్వరి ఉన్నారు.

రాజ్యాంగం, హక్కులు తెలుసుకోవాలి

● సీనియర్ సివిల్ జడ్జి వాణి
● విద్యాసంస్థల్లో రాజ్యాంగ దినోత్సవం



డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో ప్రసంగిస్తున్న జడ్జి వాణి



ప్రతిజ్ఞ చేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, సీఈవో



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎన్‌సీసీ కేడెట్లు

నెల్లూరు(విద్య), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం, అది కల్పించిన హక్కులను విద్యార్థినులు తెలుసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి కే.వాణి సూచించారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం నగరంలోని పలు విద్యాసంస్థల్లో ఘనంగా నిర్వహించారు. డీకేడబ్ల్యూ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో జడ్జి మాట్లాడుతూ వరకట్నం, గృహహింస వంటి కేసుల్లో బాధితులు సత్వర న్యాయం పొందేలా న్యాయశాఖ పని చేస్తుందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ రమణరావు మాట్లాడుతూ దేశంలోనే రాజ్యాంగం అత్యున్నత శాసనమని తెలిపారు. పరిపాలనా వ్యవస్థ రాజ్యాంగ పరిధికి లోబడి పాలన సాగించాలన్నారు. అనంతరం విద్యార్థినులకు వ్యాస రచన, వక్తృత్వం, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో కోవూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ కే సుదర్శన్ కుమార్, డీకేడబ్ల్యూ కళాశాల అధ్యాపకులు డాక్టర్ తోటకూర రాంబాబు, సుమలత, సిబ్బంది పాల్గొన్నారు. కాగా, డీకే ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలోనూ రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వ హించారు. ఆర్ఐవో డాక్టర్ ఏ.శ్రీనివాసులు, ఎన్‌వైకే అధికారి మహేంద్ర రెడ్డి, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కొండయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు కరుణకుమారి, ప్రసన్న, భారతి పాల్గొన్నారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

● జీవీఆర్ఆర్ జూనియర్ కళాశాలలో అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. గణిత అధ్యాపకుడు జాకీర్ రాజ్యాంగ పీఠికను చదివించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, జనహిత వాత్సల్య అనాథాశ్రమ సిబ్బంది, ఎన్ఎస్ఎస్ యూని ట్ సిబ్బంది పాల్గొన్నారు.

● కొండాయపాళెం నగరపాలక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులిచ్చారు. సమగ్రశిక్ష మానిటరింగ్ అధికారి సుధీర్‌బాబు, హెచ్‌ఎం భాస్కర్‌రావు పాల్గొన్నారు.

● స్టోన్‌హౌస్‌పేటలోని ఆర్ఎస్ఆర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గూడూరు ఎస్‌కేఆర్ ప్రభుత్వ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ గోవింద సురేంద్ర రాజ్యాంగం గురించి విద్యార్థులకు వివరించారు. హెచ్‌ఎం మధుసూదన్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎన్ సునంద విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. క్విజ్, డిబేట్, మాక్ పార్లమెంట్ పోటీలు నిర్వహించారు.

● బీవీనగర్ కేఎన్ఆర్ పాఠశాలలో 10 ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో కేడెట్లు భారత రాజ్యాంగ ప్రతిజ్ఞ చేశారు. సమీపంలోని నిర్మల్ హృదయ్ భవన్‌లో వృద్ధులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఎన్‌సీసీ ఆఫీసర్ గుండాల నరేంద్రబాబు పాల్గొన్నారు.

● బుజబుజనెల్లూరు శేషు పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ క్షేత్ర ప్రచార సహాయకుడు పీ హరికృష్ణ హాజరయ్యారు. భారత రాజ్యాంగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కరస్పాండెంట్ బోనుబోయిన ఆదిశేషయ్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కుదుముల సుబ్బారావు, పీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, రూడ్స్ ట్రస్ట్ చైర్మన్ షేక్ రసూల్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో...

నెల్లూరు(హరనాథపురం,ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని వాణిజ్యపన్నుల శాఖ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అధికారులు, ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. ఆ శాఖ ఉద్యోగుల సంఘం నెల్లూరు డివిజన్ అధ్యక్షుడు జాజుల నరసింహారావు, కార్యదర్శి సుజాతా బాయి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు యానాది మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ హక్కుల సాధన కోసం పోరాటం చేసిన ఏపీజీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణపై గత ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసుల నుంచి రాజ్యాంగం కల్పించిన రక్షణతో బయటపడ్డారని చెప్పారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌కు ధన్యవాదాలు తెలిపారు.

● ఏపీజీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణపై అక్రమ కేసులను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించటం హర్షణీయమని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై రమణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి పీవీఎస్‌టీ రాంప్రసాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

● డీఆర్‌డీఏ కార్యాలయంలో పీడీ నాగరాజకుమారి అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా సహకారశాఖాధికారి కార్యాలయంలో డీసీవో గురప్ప అధికారులు, ఉద్యోగులతో రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేయించారు.

భారత రాజ్యాంగం ఎంతో విశిష్టమైనది

నెల్లూరు (వైద్యం,ఆంధ్రజ్యోతి): భారత దేశ రాజ్యాంగం ఎంతో విశిష్టమైనదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సభ్యుడు బాల సుధాకర్ అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నగరంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సమాజంలో అసమానతలు తొలగిపోవాలన్న అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా అందరూ నడుచుకోవాలని కోరారు.

జనసేన ఆధ్వర్యంలో...

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట,ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ ఆధ్వర్యంలో నాయకులు, జనసైనికులు రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేశారు. కాగా, పార్టీ జిల్లా కార్యాలయంలో నూనె మల్లికార్జున యాదవ్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో...

నెల్లూరు,(సాంస్కృతికం,ఆంధ్రజ్యోతి): ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నగరంలోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. నాయకుడు ముకుందన్ మాట్లాడుతూ ఒకే ప్రభుత్వం, ఒకే న్యాయవ్యవస్థ, ఒకే పరిపాలన వ్యవస్థల్ని మన రాజ్యాంగం ప్రతిపాదించిందన్నారు. అనంతరం జిల్లా సమరసత వేదిక నాయకులతో కలిసి జాయింట్ కలెక్టర్‌ను కలిసి రాజ్యాంగం విశిష్టత, అహల్యా బాయి హోల్కర్ పుస్తకాలను అందజేశారు. కోడూరు సత్యం, లక్ష్మీనారాయణ, మోమిడి శ్రీనివాసులు, దాసరి రాజేంద్రప్రసాద్, కృష్ణమూర్తి, జనార్దన్ తదిత రులు పాల్గొన్నారు.

జడ్పీ కార్యాలయంలో...

నెల్లూరు,(జడ్పీ,ఆంధ్రజ్యోతి): భారత రాజ్యంగ దినోత్సవ వేడుకలను జిల్లా పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, సీఈవో విద్యారమ కలిసి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అరుణమ్మ మాట్లాడుతూ భారత రాజ్యంగం అందరికీ దిక్సూచి అన్నారు. రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎంపీడీవోలు, జడ్పీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ భవన్‌లో...

రాజ్యంగ దినోత్సవాన్ని విద్యుత్ భవన్‌లో ఆ శాఖ ఎస్ఈ విజయన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈఈ ఎం శ్రీధర్, అకౌంటెంట్ విజిత తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

చేనేత క్లస్టర్ ఏర్పాటు చేయండి

● కేంద్ర జౌళి శాఖ మంత్రికి ఎంపీ వేమిరెడ్డి వినతి

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కోవూరు నియోజకవర్గంలోని పాటూరులో చేనేత క్లస్టర్‌ను ఏర్పాటు చేయాలని కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌ను నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కోరారు. మంగళవారం ఆయన ఢిల్లీలో మంత్రిని కలిశారు. ఎస్‌సీడీపీ కార్యక్రమంలో భాగంగా చేనేత క్లస్టర్ ఏర్పాటు ఆవశ్యకతను మంత్రికి వివరించారు. పాటూరులో 500 కుటుంబాలు పూర్తిగా చేనేత వృత్తిపైనే ఆధారపడి ఉన్నా యని చెప్పారు. ఇందుకు నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు.

కోవూరు వాసికి డాక్టరేట్



రమణయ్య

కోవూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీనగర్‌కు చెందిన రాగాల రమణయ్యకు విక్రమ సింహపురి యూనివర్శిటీ మంగళవారం పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేసింది. ఎంబీఏ పూర్తి చేసిన ఆయన విక్రమ సింహపురి యూనివర్శిటీ కావలి పీజీ సెంటర్‌లో వాణిజ్య విభాగంలో పనిచేస్తున్నారు. ప్రొఫెసర్ ఎం.చంద్రయ్య ఆధ్వర్యంలో డెవలప్‌మెంట్ ఆఫ్ మేనేజిరియల్ పర్సోనల్ ఇన్ సెలెక్ట్ మ్యానుఫ్యాక్చరింగ్ ఇండస్ట్రీస్ ఆఫ్ ఎస్‌పీఎస్ ఆర్ నెల్లూరు డిస్ట్రిక్ అనే అంశంపై పరిశోధన చేసి నివేదిక సమర్పించారు పోస్టు డాక్టొరల్ ఫెలో డిగ్రీ సాధించడమే తన జీవితలక్ష్యమని ఆయన అన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ఇందుకూరుపేట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని జగదేవిపేట పీహెచ్‌సీ పరిధిలోని ఆదెమ్మసంత్రం జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్‌లో మంగళవారం వైద్య శిబిరం ఏర్పాటు చేసి విద్యార్థులకు వైద్య, రక్తపరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు డాక్టర్ కిషోర్‌కుమార్, డాక్టర్ బ్రహ్మేశ్వరనాయుడు మాట్లాడుతూ రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. విద్యార్థుల హెల్త్ కార్డులు అప్‌లోడ్ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్ రావు, హెచ్ఈవో శ్రీనివాసులు, హెల్త్ సూపర్‌వైజర్లు రమా, సతీష్‌బాబు, హైస్కూల్ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం జి.శేఖర్, ఉపాధ్యాయులు ఎం.సుబ్బయ్య, జి.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల వివరాలపై సర్వే

● హౌసింగ్ పీడీ వేణుగోపాల్‌రావు



గిరిజనకాలనీలో పరిశీలిస్తున్న పీడీ

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గిరిజనులకు ఇళ్ల మంజూరుకు సంబంధించి దెబ్బతిన్న ఇళ్లు, ఇళ్లు లేని వారి వివరాల సేకరణకు సర్వే చేయాలని హౌసింగ్ పీడీ వేణుగోపాల్‌రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన జొన్నవాడలోని గిరిజన కాలనీలను సందర్శించారు. 20 ఏళ్ల క్రితం నిర్మించిన ఇళ్లు కొన్ని వర్షాలకు ఉరుస్తుండగా, కొన్ని కూలే స్థితిలో ఉన్నాయని గిరిజనులు వాపోయారు. అర్హులైన లబ్ధిదారుల వివరాలను పీఎంఏవైయు-2.0లో నమోదు చేయాలని సూచించారు. ఆయన వెంట ఏఈ పెంచలయ్య, వర్క్‌ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, సర్పంచు కందికట్టు పెంచలయ్య ఉన్నారు.

29న కార్పొరేషన్‌లో మేళా

నెల్లూరు(సిటీ), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణాలలో నెలకొన్న ఇబ్బందులను పరిష్కరించేందుకు ఈనెల 29న కార్పొరేషన్‌లో మేళా నిర్వహిస్తున్నట్లు కమిషనర్ సూర్యతేజ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ మేళా జరుగుతుందని, భవన నిర్మాణాలలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా సంప్రదించాలని కోరారు.

'ఆధార్' ఉంటేనే వైద్యం!

● కార్డు ఇప్పించాలని గర్భిణి వినతి

వెంకటాచలం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఇతర కార్యక్రమాలతో పాటు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం పొందాలన్నా ఆధార్ ఉండాల్సిందే. ఈ క్రమంలో 8 నెలల గర్భిణీగా ఉన్న ఓ గిరిజన యువతికి ఆధార్‌కార్డు లేకపోవడంతో ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం అందక అవస్థలు పడుతోంది. దీంతో తన మొర ఆలకించి ఆధార్ కార్డు ఇప్పించాలని వేడుకొంటుంది. వివరాల మేరకు.. మండలంలోని పుంజులూరుపాడు గిరిజన కాలనీకి చెందిన మానికల వెంకటేశ్వర్లుకు మూడేళ్ల క్రితం నిడిగుంటపాళెంకు చెందిన అఖిలతో వివాహమైంది. వారికి తొలి కాన్పులో ఒక పాప జన్మించగా ప్రస్తుతం అఖిల 8నెలల గర్భిణి. ఆ గిరిజన యువతి వైద్య పరీక్షల కోసం నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రి, వెంకటాచలం సీహెచ్‌సీ, ఇస్కపాళెం పీహెచ్‌సీల్లో తొలి నాలుగు నెలలు భర్త ఆధార్ కార్డు ఆధారంగా వైద్యం చేయించుకోగా ప్రస్తుతం తప్పనిసరిగా ఆధార్‌కార్డు ఉండాల్సిందేనని వైద్యులు సూచించారు. అయితే గత రెండేళ్లగా ఆధార్ కోసం ఆమె కాళ్లు అరిగేలా తిరుగుతున్నా ఎలాంటి ప్రయోజనం లేదు. ఇటీవల గిరిజనుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ సెల్‌లో సైతం తనకు ఆధార్ కార్డు ఇప్పించాలని వినతిపత్రం ఇచ్చినా ఎవరూ కనికరించలేదు. ఉన్నతాధికారులు స్పందించి ఆధార్ కార్డు ఇప్పించి ఆదుకోవాలని ఆ దంపతులు కోరుతున్నారు.



భర్త వెంకటేశ్వర్లుతో గర్భిణీ అఖిల

రాజ్యాంగం ప్రజాస్వామ్యానికి ప్రామాణికం : వీఎస్‌యూ వీసీ



వెంకటాచలం: అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న వీసీ



బుచ్చి : అంబేడ్కర్‌కు నివాళులర్పించిన ఎంపీడీవో

వెంకటాచలం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎంతో దూరదృష్టితో నిర్మించిన రాజ్యాంగం ప్రజాస్వామ్యానికి ప్రామాణికమని వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ సారంగం విజయభాస్కర్‌రావు అన్నారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి యూనివర్శిటీలో మంగళవారం రాజనీతి, ప్రభుత్వ పాలన విభాగం ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీసీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అధ్యాపకులతో కలిసి విద్యార్థులు రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో వర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వర్శిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ అల్లం ఉదయశంకర్, అధ్యాపకులు డాక్టర్ ప్రభాకర్‌రావు, డాక్టర్ గోవింద్, డాక్టర్ సునీల్‌కుమార్, డాక్టర్ ఒబులపతి తదితరులు పాల్గొన్నారు.

● బుచ్చిరెడ్డిపాళెం,(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీహరి, ఏవో మంజులమ్మ, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే బుచ్చి, రామచంద్రాపురంతో పాటు మండలంలోని పలు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు.

● తోటపల్లిగూడూరు,(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల ప్రజాపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల సౌత్ ఆములూరులో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం భారత రాజ్యాంగంపై వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్.అహ్మద్‌బాషా, యాజమాన్య కమిటీ వైస్‌చైర్మన్ వీ.గిరిజకుమారి, ఉపాధ్యాయులు కె.వసంతలక్ష్మి, కె.హెప్సీవిద్యుల్లత, విద్యార్థులు పాల్గొన్నారు.

● పొదలకూరు,(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నాగార్జున ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ సునీతారెడ్డి, ప్రిన్సిపాల్ లక్ష్మీదుర్గా, స్కూల్ యాజమాన్యం ఏ.సుబ్బారావు, చంద్రశేఖర్, కృష్ణ, జీఎస్.రెడ్డి, పాపయ్య, పాల్గొన్నారు.

విద్యార్థులకు ఓ లక్ష్యం ఉండాలి : డీఈవో



విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలిస్తున్న డీఈవో

రాపూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఓ లక్ష్యమంటూ ఉండాలని డీఈవో ఆర్.బాలాజీరావు అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఆయన మండలంలోని గోనుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ పిల్లలందరూ లక్ష్యసాధనతోపాటు రోల్ మోడల్‌గా ఉండాలన్నారు. ఈ సందర్భంగా బయాలజీ ఉపాధ్యాయిని కవిత సొంత నిధులతో 10వ తరగతి విద్యార్థులకు పుస్తకాలను బహూకరించారు. క్విజ్ పోటీలో గెలుపొందిన లక్ష్మీదేవి బృందానికి బహుమతులను అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాళ్లను డీఈవో సందర్శించారు. అనంతరం జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత పరంధామయ్యను సన్మానించారు. డీఈవో పిల్లల మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి రుచి చూశారు. తదుపరి పాఠశాల హెచ్‌ఎం నాగేంద్రకుమార్ డీఈవోను శాలువా కప్పి పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవోలు గుండవోలు శ్రీనివాసులు, షేక్.జిలానీబాషా, శేషగిరిరావు, పరంధామయ్య, విజయలక్ష్మి, దేవి, కె.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు. అలాగే కండలేరులోని డాక్టర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవం ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ కె.భారతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సెప్టిక్ ట్యాంకు క్లీనర్లు రూల్స్ పాటించాలి



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(సిటీ), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): సెప్టిక్ ట్యాంకుల క్లీనింగ్ వాహనాలు నడిపే వారు కార్పొరేషన్ అనుమతులు, నియమ నిబంధనలు పాటించకుంటే ఊరుకునే లేదని ఎన్ ఎంసీ కమిషనర్ సూర్యతేజ హెచ్చరించారు. కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం వారందరీ తో కలిసి సమావేశం నిర్వహించారు. లైసెన్సులు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెప్టిక్ ట్యాంకుల్లో నింపిన వ్యర్థాన్ని అల్లీపురం, వెంకటేశ్వర పురంల్లో ఎస్టీపీల్లోనే విడుదల చేయాలని ఆదేశించారు. ఇంకెక్కడ విడుదల చేస్తే కఠినంగా చర్యలుంటాయని హెచ్చరించారు. ప్రజలు సెప్టిక్ ట్యాంకు క్లీనింగ్ వాహనాలతో అవ సరం ఉంటే 14420 నెంబరుకు ఫోన్ చేయాలని కోరారు. ఇందుకోసం కార్పొరేషన్ ప్రత్యేక వ్యవస్థ ను ఏర్పాటు చేసిందని చెప్పారు. ఇంటింటా సర్వేకు నగర వాసులంతా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమాలలో ఎస్ఈ రామ్మోహన్, ఈఈ, డీఈఈలు తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక ఆక్రమణలను అడ్డుకోండి

● అబ్దుల్ అజీజ్‌కి ముస్లింల మొర



అబ్దుల్ అజీజ్‌తో ఊటుకూరు ముస్లింలు

విడవలూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊటుకూరులో శ్మశాన వాటిక ఆక్రమణలను అడ్డుకోవాలని ఆ గ్రామ ముస్లింలు రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం నెల్లూరులోని ఆయన నివాసంలో కలసి వినతిపత్రం అందజే శారు. ముస్లింలకు కేటాయించిన శ్మశాన వాటిక ను కొందరు ఆక్రమించుకుంటుండగా గ్రామానికి చెందిన ఓ పార్టీ నేతలు వారికి అండగా నిలిచి తమను ఇబ్బదులకు గురిచేస్తున్నారని తెలిపారు. స్పందించిన అబ్దుల్ అజీజ్ స్పందిస్తూ ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

29 నుంచి చాంబర్ ఆఫ్ కామర్స్

బిజినెస్ ఎక్స్‌పో

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 29 నుంచి డిసెంబరు 1వతేదీ వరకు బిజినెస్ ఎక్స్‌పో జరుగుతుందని ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ ఒమ్మిన సతీష్ తెలిపారు. మంగళవారం జర్నలిస్టు భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. బిజినెస్ ఎక్స్‌పో విజయవాడలోని ఎస్ఎస్ కన్వెన్షన్‌లో జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కొండా శేఖర్ రెడ్డి, రవీంద్రబాబు, తదితరులు పాల్గొ న్నారు.

రాష్ట్ర రగ్బీ పోటీలకు 'రవీంద్ర భారతి' విద్యార్థులు

నెల్లూరు(విద్య), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గుంటూరులో త్వరలో జరగనున్న 68వ రాష్ట్రస్థాయి అండర్-17 రగ్బీ పోటీలకు నగరంలోని పత్తేఖాన్‌పేట రవీంద్రభారతి పాఠశాల విద్యార్థులు ఎస్ గిరీష్, ఎస్‌కే సల్మాన్, ఎస్‌కే ఫైజాన్ రజా ఎంపికైనట్లు ఆ విద్యాసంస్థల జోనల్ ఇన్‌చార్జి వై శ్రీహరి తెలిపారు. సోమవారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్ర మంలో ఆయన మాట్లాడారు. తమ పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవడం ఆనం దంగా ఉందన్నారు. రాష్ట్ర పోటీల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో ప్రిన్సిపాల్ ఎం సుమలత, పీఈటీ డీ వంశీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నో పాత్రల్లో జీవించిన రమణారెడ్డి

● సినీ నటుడు బ్రహ్మానందం ● 'నవ్వుల మాంత్రికుడు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బ్రహ్మానందం, తదితరులు

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 26(ఆంధ్రజ్యోతి) : జిల్లాకు చెందిన తిక్కవరపు రమణారెడ్డి సినిమాల్లో ఎన్నో పాత్రల్లో జీవించిన మహానటుడని సినీనటుడు డాక్టర్ బ్రహ్మానందం తెలిపారు. ఉదయ గిరి ఫయాజ్ రచించిన నవ్వుల మాంత్రికుడు రమణారెడ్డి అనే పుస్తకాన్ని బ్రహ్మానందం స్వగృహంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత్రలపై అవగాహన కలిగి నిబద్ధత తో నటించిన గొప్పనటుడు రమణారెడ్డి అని కొనియా డారు. నెల్లూరు యాసతో ఎన్నో చిత్రాలను బతికించా డన్నారు. ఈ పుస్తక రచనకు మూవీ వాల్యూ అధినేత జిలానీ బాషా ఎంతో సహకరించాలని రచయిత ఫయాజ్ తెలిపారు. పుస్తక ప్రచురణకు రమణారెడ్డి పెద్ద బ్బాయి ప్రభాకర్‌రెడ్డి సహకారం అందించారని తెలిపారు. సీనియర్ జర్నలిస్టు వినాయకరావు మాట్లాడుతూ నవ్వుల మాంత్రికుడు తిక్కవరపు రమణారెడ్డి పుస్తకాన్ని పాఠకులు జైవితలాచార్యలా ఆదరించాలని కోరారు.

ప్రమాదాల్లో అప్రమత్తంగా ఉండాలి : ఆర్ఐవో



ప్రమాదాల నివారణపై శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

నెల్లూరు(విద్య), నవంబరు 26(ఆంధ్రజ్యోతి) :ప్రమాదాలు సంభవించిన సమయాల్లో అప్రమత్తంగా వ్యవహరించాలని ఆర్ఐవో డాక్టర్ ఆదూరు శ్రీనివాసులు తెలిపారు. నగరంలోని డీకే ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో సోమవారం ఎన్‌డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో విపత్తు లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరిత్యాలు, మా నవ తప్పిద ప్రమాదాలు సంభవిస్తే ఆందోళన పడకుండా స్వీయ రక్షణ తోపాటు పొరుగువారికి సహాయం చేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. అనంతరం ఎన్‌డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ రాజీవ్ దరిపా ప్రమాద పరిస్థితుల్లో వారు చేపడుతున్న నిర్మాణాత్మక కార్యక్రమాలను వివరించారు. తు ఫాన్, వరదలు, భూకంపాలు, గుండెపోటు వం టి అత్యవసర సమయాల్లో ఎలా బయటప డాలన్న విషయాలపై విద్యార్థినులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కొండయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ వ్రతం



సామూహిక సత్యనారాయణ వ్రతంలో భక్తులు

కోవూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఇనమడుగులోని సత్యానంద ఆశ్రమంలో మంగళవారం సామూహిక సత్యనారాయణ వ్రతం భక్తిశ్రద్ధ లతో నిర్వహించారు. సుమారు 100 మంది దంపతులు వ్రతంలో పాల్గొన్నారు. టీడీపీ నాయకులు కొల్లారెడ్డి సుధాకర్‌రెడ్డి, కొల్లారెడ్డి సునీల్‌రెడ్డి, గుత్తికొండ వెంకయ్య, తిరుమూరు విజయ్‌కుమార్ రెడ్డి, దంపూరు బలరామిరెడ్డి, ఎరటపల్లి రవీంద్రరెడ్డి, చల్లా సుధాకర్‌రెడ్డి పూజల్లో పాల్గొని భక్తులు అన్నదానం చేశారు.

అపరిచిత ఫోన్‌కాల్స్‌తో అప్రమత్తంగా ఉండాలి

● నేదురుపల్లిలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

పొదలకూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రజలు అపరిచిత ఫోన్‌కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు కరణం రవీంద్రబాబు, ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ సెక్రటరీ షేక్.అహ్మద్ కోరారు. మండలంలోని నేదురుపల్లి దళితవాడలో ఆర్‌బీఐ సౌజన్యంతో ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ బ్యాంకు ఖాతాదారులకు, పొదుపు సభ్యులకు ఆర్థిక అక్షరాస్యత, సైబర్ మోసాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. బ్యాంకు సేవలు, ఆర్థిక మోసాలపై అవగాహన కల్పించారు. వివిధ పథకాలకు సంబంధించి గోడపత్రిక ఆవిష్కరించి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ రీసోర్స్ పర్సన్‌లు కె.వెంకటేశ్వర్లు, ఎ.చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలుచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పత్రిక పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ కింది ఫోన్ నెంబర్‌ను సంప్రదించగలరు.

నెల్లూరు ఏసీఎం - 9985411424

జిల్లాకు ఫిలిప్స్ కార్బన్ బ్లాక్

పరిశ్రమ

- నాయుడుపేట వద్ద రూ. 3718 కోట్లతో ప్లాంట్ ఏర్పాటుకు ఆసక్తి
- 116 ఎకరాల కేటాయింపునకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

తిరుపతి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా పారిశ్రామిక అభివృద్ధికి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌తీసుకుంటున్న చర్యలు ఫలితాలనిస్తున్నాయి. తాజాగా నాయుడుపేట వద్ద రూ.3718 కోట్ల భారీ పెట్టుబడితో ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు ఫిలిప్స్ కార్బన్ బ్లాక్ లిమిటెడ్ సంస్థ ముందుకొచ్చింది. దీనికి నాయుడుపేట వద్ద 116 ఎకరాలు కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పారిశ్రామిక రంగ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఎంత వేగవంతంగా అమలవుతున్నాయో తెలుసుకునేందుకు ఈ పరిశ్రమే ఓ ఉదాహరణ. రబ్బర్ బ్లాక్స్, వాల్యూ యాడెడ్ కెమికల్స్ తయారీకి పేరుపడిన ఈ పరిశ్రమ.. నాయుడుపేట వద్ద ప్లాంట్ ఏర్పాటుపై తమ ఆసక్తి చూపింది. ఈ మేరకు 116.62 ఎకరాలను చదరపు మీటరుకు రూ.1948 ధరతో కేటాయించాలని సెప్టెంబరు 20న ఏపీఐఐసీకి దరఖాస్తు చేసుకుంది. రూ.3718 కోట్ల పెట్టుబడితో ప్లాంట్ ఏర్పాటు చేస్తామని, తద్వారా 200 మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని తెలియజేసింది. కేవలం రెండు నెలల వ్యవధిలోనే ఆ ఫైలు ఆయా విభాగాల నడుమ పరుగులు తీసింది. ఈ నెల 16వ తేదీన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక కమిటీ సమావేశమై అదే ధరతో భూమిని కేటాయించాలని సిఫారసు చేసింది. 19వ తేదీన బోర్డు ఆమోదించింది. ఈ సిఫారసులకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం నాయుడుపేట సెజ్‌ను డీనోటిఫై చేసి 116.62 ఎకరాల భూమిని ఫిలిప్స్ పరిశ్రమకు కేటాయించాలని ఏపీఐఐసీని ఆదేశిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. అన్ని సదుపాయాలనూ త్వరగా కల్పించి త్వరగా పరిశ్రమల ఏర్పాటయ్యేలా చూడాలని వివిధ శాఖలకు ఆదేశాలు జారీ చేసింది.



భారీ వానల హెచ్చరిక

- అధికారులు అప్రమత్తంగా ఉండాలన్న కలెక్టర్
- కంట్రోల్ రూం నెంబరు 0877-2236007

కంట్రోల్ రూమ్ నెంబర్లు

కలెక్టరేట్ : 0877-2236007

గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయం:
08624-25807

సూళ్లూరుపేట ఆర్డీవో కార్యాలయం:
08623-295345

తిరుపతి ఆర్డీవో కార్యాలయం:
7032157040

శ్రీకాళహస్తి ఆర్డీవో కార్యాలయం:
8555003504


తిరుపతి (కలెక్టరేట్), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): అల్పపీడనం కారణంగా జిల్లాలో గురువారం వరకు భారీ వర్షాలు కురవనున్నాయని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఎటువంటి ఆస్తి.. ప్రాణనష్టాలు జరగకుండా యంత్రాంగం చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. మంగళవారం ఆయన సంబంధిత అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కేంద్రంలో, డివిజన్, మండల కేంద్రాల్లో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశామన్నారు. కోస్తా తీర ప్రాంతాల్లో మత్స్యకారులను అప్రమత్తం చేసి సముద్రంలోకి వేటకు వెళ్లకుండా పర్యవేక్షించాలన్నారు. లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ఏదైనా సహాయం, సమాచారం కోసం ప్రజలు ఆయా కంట్రోల్ రూములకు ఫోను చేయాలన్నారు.

తీరంలో ఎగిసిపడుతున్న అలలు

బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో వాకాడు మండలం తూపిలిపాళెం తీరంలో సముద్ర కెరటాలు ఎగిసిపడుతున్నాయి. మంగళవారం తెల్లవారుజాము నుంచి ఈదురుగాలుల తీవ్రత ఎక్కువగా ఉండటంతో అలలు ఒడ్డుకు వస్తున్నాయి. ఈదురుగాలులకు సముద్రం ఉప్పొంగుతోంది. ఉదయం నుంచి తేలికపాటి వర్షంతోపాటు మంచుతోడుకావడంతో ప్రజలు చలికి వణికిపోతున్నారు. మూడు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు, ప్రజలు అప్రమత్తమవుతున్నారు.

\- వాకాడు, ఆంధ్రజ్యోతి

నేడు సీఎం చంద్రబాబు రాక



తిరుపతి(నేరవిభాగం), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం నారావారిపల్లెకు బుధవారం సాయంత్రం 6.20 గంటలకు సీఎం చంద్రబాబు రానున్నారు. గురువారం జరిగే తన తమ్ముడు నారా రామ్మూర్తి నాయుడి వైకుంఠ సమారాధన కార్యక్రమంలో పాల్గొననున్నారు. అలాగే, మంత్రి నారా లోకేశ్ కూడా సాయంత్రం స్వగ్రామానికి రానున్నారు. ఇక, మంగళవారం మధ్యాహ్నం సీఎం సతీమణి నారా భువనేశ్వరి హైదరాబాదు నుంచి నారావారిపల్లెకు చేరుకున్నారు. నారావారిపల్లెలో గురువారం జరిగే కార్యక్రమానికి పలువురు మంత్రులు, డిప్యూటీ స్పీకరు, నేతలు, శ్రేణులు రానున్నారు. ఈ క్రమంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

తిరుపతిలో 'సిట్' కార్యాలయం సిద్ధం


తిరుపతి(నేరవిభాగం), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో సీబీఐ సిట్ కార్యాలయం సిద్ధమైంది. టీటీడీ పరిధిలోని భూదేవి కాంప్లెక్సులో ఉన్న ఎస్వీబీసీ పాత కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఇందులోకి ఎవరినీ అనుమతించడంలేదు. గుర్తింపు కార్డులున్న టీటీడీ సిబ్బందినే అనుమతిస్తున్నారు. సిట్ కార్యాలయంలో సోమవారం ప్రాథమికంగాను.. మంగళవారం నుంచి పూర్తిస్థాయిలో అధికారిక కార్యకలాపాలను చేపట్టారు. గ్రౌండు ఫ్లోర్‌లో వీడియో కాన్ఫరెన్సు హాలు, మొదటి అంతస్తులో విచారణ, కార్యాలయం ఏర్పాటు చేశారు. ఇప్పటికే స్వాధీనం చేసుకున్న ఏఆర్, వైష్ణవి డెయిరీలకు సంబంధించి ఫైళ్లు, టీటీడీకి, డెయిరీల మధ్య కుదిరిన ఒప్పందాల రికార్డులను ఇక్కడ పరిశీలిస్తున్నారు. ప్రతి రోజూ ఇక్కడ జరుగుతున్న పరిణామాలు, విచారణ నివేదికలను వీడియో కాన్ఫరెన్సు ద్వారా సీబీఐ అధికారులకు వివరిస్తున్నారు. సిట్ కార్యాలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రిజర్వు బలగాలు మోహరించాయి. అదనపు ఎస్పీ స్థాయి అధికారి నేతృత్వంలో విచారణ ప్రారంభించారు. ప్రస్తుతం నలుగురు డీఎస్పీలు, ఇద్దరు సీఐలు, మరికొందరు పోలీసు బృందాలు కలసి టీమ్‌లుగా విడిపోయి విచారిస్తున్నారు. ఇప్పటి వరకు రెండు డెయిరీలకు సంబంధించిన దాదాపు 25 నుంచి 40 ఫైళ్లు స్వాధీనం చేసుకుని సిట్ కార్యాలయం వద్ద పరిశీలిస్తున్నట్లు తెలిసింది.



పాఠశాల రాజ్యాంగ ప్రతులను ఆవిష్కరిస్తున్న కమిటీ

పాఠశాల రాజ్యాంగం 6లో లాంఛనంగా ఆమోదం

ఊరందూరులో వేడుకగా కార్యక్రమం



హద్దు మీరినందుకేనా!

- చెవిరెడ్డిపై పోక్సో, ఎస్సీఎస్టీ కేసులు
- మైనర్ బాలిక విషయంలో అమానవీయ రాజకీయం ఫలితం
- బలమైన సెక్షన్లతో షాక్ ఇచ్చిన జిల్లా పోలీస్
- వైసీపీ కేడర్‌లో కలకలం

తిరుపతి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో హద్దులు మీరుతున్నవారిపై ప్రభుత్వం కఠినచర్యలకు పూనుకుంటున్నా లెక్కలేనట్లుగా వ్యవహరిస్తున్న జిల్లా వైసీపీ నేతలకు గట్టి హెచ్చరికే ఎదురైంది. చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డిపై ఏకంగా పోక్సో, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ వంటి తీవ్రత కలిగిన సెక్షన్లతో కేసు నమోదు కావడం వారిని నివ్వెరపరుస్తోంది. అధికారంలోకి వచ్చిన ఐదు నెలలకే కూటమి ప్రభుత్వం ప్రతిష్టను దొంగ దెబ్బతీసేందుకు వైసీపీ సోషల్ మీడియాతో పాటూ జిల్లా నాయకులు కూడా రెచ్చిపోయారు. కల్తీ నెయ్యి కుంభకోణం, శ్రీవాణి నిధులపై అనుమానాలు, తిరుపతికి ఇష్టారాజ్యంగా వందల కోట్ల టీటీడీ సొమ్ములు మళ్లించడం వంటి అంశాలు భగ్గుమంటున్నా జిల్లాలోని కొందరు వైసీపీ నాయకుల దూకుడు తగ్గలేదు. మీడియా సమావేశాల్లోనూ హద్దులు దాటి వ్యాఖ్యలు చేస్తూనే ఉన్నారు. వీరిపట్ల ఉదాశీనంగా ఉన్నారంటూ కూటమి కేడర్ అసంతృప్తితో రగిలిపోతోంది. మరోవైపు పార్టీలకు అతీతంగా రాజకీయ నాయకులకు ఇదో హెచ్చరిక అవుతుందని జనం భావిస్తున్నారు.

లెక్కలేని తనమే కొంప ముంచుతోందా?

రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా ఉన్నా జిల్లా వైసీపీ నాయకులు తేలిగ్గా తీసుకున్నందువల్లే వారి చాపకిందకు నీరొచ్చిందని అంటున్నారు. జగన్ అధికారంలో ఉన్నపుడు వ్యవహరించిన తీరుకు ఇప్పుడూ వీరు ఏమాత్రం తగ్గడం లేదంటున్నారు. సామాజిక బాధ్యత లేకుండా ఓ మైనర్ దళిత బాలికపై అనుచిత ప్రచారం సాగించడం, బాలిక ఉనికిని బయటపెట్టడం ప్రజలను షాక్‌కు గురి చేసింది. మైనర్ బాలికలకు సంబంధించి ఏదైనా నేరం జరిగినపుడు వారి వివరాలు బహిర్గతం చేయకూడదు. వారి పేర్లు గానీ, ఫొటోలు గానీ, వారి ఉనికిని తెలిపే ఏ ఒక్క విషయమూ వెల్లడించకూడదు. వైసీపీ నేతలు అన్నింటినీ ఉల్లంఘించారు. ఇది బాధ్యతా రాహిత్యం కాక మరేమిటవుతుందన్న ప్రశ్న ఎదురవుతోంది.

ఏ2 తర్వాత ఎవరు?

చెవిరెడ్డిపై పెట్టిన కేసు.. రెచ్చిపోతున్న మిగిలిన వైసీపీ నేతలకు గట్టి హెచ్చరికగా భావిస్తున్నారు. అనేక ఆరోపణలను ఇప్పటికే ఎదుర్కొంటున్న ఆ నాయకులకే ఇబ్బందులు తప్పవనే చర్చ జరుగుతోంది. బాలిక వ్యవహారంలోనూ రుయా ఆసుపత్రి వద్దకు చేరుకుని హల్‌చల్ చేసిన నాయకుల పేర్లు కూడా తదుపరి జాబితాలో ఉంటాయని అంటున్నారు. ఇదే కేసులోనూ మరికొందరి పేర్లు చేరుస్తారని చెబుతున్నారు.

అమానవీయం కాదా?

ఎర్రావారిపాలెం మండలంలో ఈనెల 4న జరిగిన ఘటనలో అత్యాచారం జరిగిందని బాధిత బాలిక చెప్పలేదు. తల్లిదండ్రులు కూడా చెప్పలేదు. ఒంటిపై వున్న స్వల్ప గాయాలు చూపి తనపై దాడి జరిగిందని బాలిక చెప్పింది కూడా అబద్ధమేనని విచారణలో భాగంగా జిల్లా ఎస్పీ మరుసటి రోజే ప్రకటించారు. స్వల్ప గాయాలు సైతం బాలిక తనకు తానుగా చేసుకున్నవే తప్ప ఇతరులు చేసింది కాదని ఎస్పీ స్పష్టం చేశారు. అయితే వీటికి పూర్తి భిన్నంగా వైసీపీ నేతలు మీడియా ఎదుట ఆరోపణలు చేయడం విస్తుగొలుపుతోంది. బాలిక వివరాలు బయటపెట్టడం, చివరికి చినిగిన దుస్తులతో చికిత్స పొందుతున్న బాలిక ఫోటోను కూడా సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడం అంతకంటే దారుణమన్న విమర్శలు వస్తున్నాయి.

చెవిరెడ్డికి ఏమైంది?

సాధారణంగా చెవిరెడ్డి ఎవరిపైనా ఘాటు ఆరోపణలు చేసేవారు కాదు. మీడియా సమావేశాల్లోనూ ఆచి తూచి మాట్లాడేవారు. అధికారంలో ఉన్న అయిదేళ్లూ సంయమనంగా ఉన్న ఆయన ఇప్పుడు వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు గురవుతోంది. ఎర్రావారిపాలెం మండల ఘటనకు సంబంధించి ఈనెల 4, 5 తేదీల్లో వ్యవహరించిన తీరు భిన్నంగా వుందన్న వ్యాఖ్యలు జనం నుంచీ వినిపిస్తున్నాయి. తాను ఎంతో క్రమశిక్షణ కలిగిన వ్యక్తిగా తరచూ చెప్పుకునే చెవిరెడ్డే పోలీసులు తనపై బలమైన సెక్షన్లతో కేసు పెట్టే అవకాశం ఇవ్వడమే ఇపుడు చర్చనీయాంశమవుతోంది.

డీలాపడుతున్న వైసీపీ శ్రేణులు

రాష్ట్ర వైసీపీలో బలమైన నేత, జగన్‌కి అత్యంత సన్నిహితుడు అయిన చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిపైనే కేసు పెట్టడంతో జిల్లావ్యాప్తంగా వైసీపీ వర్గీయుల ఆందోళనకు గురవుతున్నారు. కేడర్ అయితే డీలా పడిపోతోంది. పెద్ద నాయకుల పరిస్థితే ఇలా ఉంటే తమ గతేమవుతుందనే ఆందోళన, భయం వారిలో పెరిగిందంటున్నారు.

- నేడు లక్ష కుంకుమార్చన.. అంకురార్పణ

రేపటి నుంచి

పద్మావతీ బ్రహ్మోత్సవాలు

తిరుచానూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభం కానున్నాయి. డిసెంబరు 6వ తేది వరకు తొమ్మిది రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో అమ్మవారు ఉదయం 8 గంటలకు, రాత్రి 7 గంటలకు వివిధ వాహనాలపై తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఈ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని అమ్మవారి ఆలయంలోని శ్రీకృష్ణస్వామి ముఖ మండపంలో బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు లక్ష కుంకుమార్చనను నిర్వహించనున్నారు. అమ్మవారి అష్టోత్తర శతనామావళిని లక్షసార్లు జపిస్తూ కుంకుమార్చన చేస్తారు. ఈ సేవలో పాల్గొనదలచిన దంపతులు టికెట్ కొనుగోలు చేసి పాల్గొనవచ్చు. ఇక, బ్రహ్మోత్సవాలు ప్రారంభ సూచికగా బుధవారం సాయంత్రం అమ్మవారి ఆలయంలో అంకురార్పణ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా అమ్మవారిని తిరుచ్చిపై.. వెంట సర్వసేనాధిపతి విష్వక్సేనుడిని ఉద్యానవనానికి వేంచేపు చేస్తారు. అక్కడ పుట్టమట్టిని సేకరించి తిరిగి ఊరేగింపుగా ఆలయంలోని యాగశాలకు చేరుకుని అంకురార్పణ ఘట్టానికి శ్రీకారం చుడతారు. సాయంత్రం 6నుంచి 8.30గంటలవరకు ఈ కార్యక్రమం జరుగుతుంది.

రేపు ధ్వజారోహణం

గురువారం ఉదయం 9 నుంచి 9.30 గంటల మధ్య ధనుర్లగ్నంలో ధ్వజారోహణం జరుగుతుంది. గజ ధ్వజానికి, ధ్వజస్తంభానికి పూజచేసి గజ పటాన్ని ధ్వజస్తంభంపైకి ఆరోహణం చేస్తారు. దీంతో ఉత్సవాలకు సకల దేవతలను ఆహ్వానిస్తారు. ఆ రోజు రాత్రి ఏడు గంటలకు చిన్నశేషవాహనంతో అమ్మవారి వాహన సేవలు ప్రారంభమవుతాయి. కాగా, గురువారం మధ్యాహ్నం 3 గంటలకు రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తిరుచానూరుకు చేరుకుని రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

వాహన సేవలిలా

గురువారం ఉదయం ధ్వజారోహణం, సాయంత్రం చిన్నశేషవాహనం, 29న ఉదయం పెద్దశేషవాహనం, సాయంత్రం హంసవాహనం, 30న ముత్యపుపందిరి, సింహ, డిసెంబరు 1న కల్పవృక్ష, హనుమంత, 2న పల్లకీ ఉత్సవం, సాయంత్రం 4 గంటలకు వసంతోత్సవం, రాత్రి గజవాహనం, 3న సర్వభూపాల, సాయంత్రం స్వర్ణరథోత్సవం, రాత్రి గరుడ, 4న సూర్యప్రభ, చంద్రప్రభ, 5న రథోత్సవం, అశ్వవాహనం, 6న మధ్యాహ్నం 12.15 గంటలకు పంచమి తీర్థం, రాత్రి 9.30 గంటలకు ధ్వజావరోహణం, 7న పుష్పయాగం.

వేడుకగా అమ్మవారి ఆలయ శుద్ధి

తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం ఆలయశుద్ధి (కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం) నిర్వహించారు. ఉదయం 6 నుంచి 9 గంటల వరకు ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో శుద్ధి చేశారు. నామకోపు, శ్రీచూర్ణంతోపాటు పలు సుగంధ ద్రవ్యాలు కలిపిన పవిత్ర జలాన్ని ఆలయమంతటా ప్రోక్షణం చేశారు. ఈ కారణంగా కల్యాణోత్సవం, ఊంజల్‌సేవను రద్దు చేశారు.

ఆర్జిత సేవల రద్దు

అమ్మవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో జరిగే అన్ని ఆర్జిత సేవలను పది రోజులపాటు రద్దు చేస్తున్నట్లు డిప్యూటీ ఈవో గోవిందరాజన్ తెలిపారు. కుంకుమార్చన, వీఐపీ, బ్రేక్, కళ్యాణోత్సవంతో పాటూ వారపు, మాసపు ఆర్జిత సేవలు రద్దు చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. డిసెంబరు 8 నుంచి ఆర్జిత సేవలు యధావిధిగా ఉంటాయన్నారు.



ఆలయ శుద్ధి కార్యక్రమంలో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం తదితరులు

సాగర పోరాటం

సముద్రంతో పెనవేసుకున్న బంధం వారిది. చావైనా..బతుకైనా అక్కడే. పోరాటమూ సముద్రంతోనే, ప్రేమా సముద్రంతోనే. తిరుపతి జిల్లాలో 67 కిలోమీటర్ల పొడవైన సముద్రతీరంలోని 32 మత్స్యకార గ్రామాల ప్రజల జీవనశైలి భిన్నంగా ఉంటుంది.





మత్స్యకారులు అర్ధరాత్రి దాటగానే నిద్ర లేస్తారు. వలలు భుజాన వేసుకుని తీరానికి చేరుకుంటారు. ఒంటి గంటకంతా నాటుపడవల్లో సముద్రంలోకి ప్రయాణం మొదలు పెడతారు. ఎగిసి దూకే అలలకు ఎదురేగుతారు. తీరం నుంచి దాదాపు 5 కిలోమీటర్ల దూరం దాకా సముద్రంలో ప్రయాణం చేస్తారు. చీకటి తెరల మాటునే వేట సాగిస్తారు. వలలకు చిక్కిన సంపదను పడవల్లో నింపుకుని వెనక్కి బయలుదేరుతారు. ఉదయం ఎనిమిదికల్లా తీరానికి చేరుకుని వలలు విప్పుతారు. ఆడవాళ్లు అప్పటికే అక్కడకి చేరుకుని ఉంటారు. చేపా, రొయ్యా, ఎండ్రకాయ... దొరికినవి వేరు చేసుకుని అమ్ముకుంటారు. 4 వేల మంది రోజువారీ జీవనం ఇది. ఏటా దాదాపు అయిదు వేల టన్నుల మత్స్య సంపదను వీరు సముద్రం నుంచి సేకరిస్తున్నారు. వాకాడు మండలంలోని కొండూరుపాళెం, తూపిలిపాళెం మత్స్యకార గ్రామాల్లో 1800 కుటుంబాలు ఇదే జీవనంతో ఉన్నారు. వీరు పగలంతా తెగిన వలలు తిరిగి అల్లుకుంటూ గడుపుతారు. చదువుల మీద దృష్టి పెట్టరు. చిన్న వయసు నుంచే సముద్ర వేటకు బయలుదేరుతారు.



- వాకాడు, ఆంధ్రజ్యోతి



ఆడంబరాలూ.. అప్పులూ

వేట ద్వారా వేల రూపాయల ఆదాయం పొందుతున్నా.. వీరి దగ్గర ఎప్పుడు డబ్బులుండవు. వలలకూ, పడవల మరమ్మతులకూ భారీగా ఖర్చు అవుతుంది. వడ్డీకి అప్పుచేస్తారు. నోటిమాట మీద లక్షల అప్పు వీరికి ముడుతుంది. చేసిన కష్టమంతా తిరిగి అప్పుతీర్చడంలోనే కరిగిపోతుంది. ఊరి సంబరాలు ఆడంబరంగా నిర్వహిస్తారు. భారీగా ఖర్చు చేస్తారు. లక్షల అప్పు తెచ్చి మరీ వేడుకలు జరుపుకుంటారు. ఈ అప్పును ఇంటికింతని భరిస్తారు. అప్పులేని ఇల్లు మత్స్యకార గ్రామాల్లో దాదాపుగా ఉండదు.



పెద్దల మాటే శాసనం

మత్స్యకారులు ఒకే మాట మీద ఉంటారు. గ్రామ పెద్దలకు విలువ ఇస్తారు. పెద్దకాపు, నడిమికాపు, చిన్నకాపు అని గ్రామానికి ముగ్గురు పెద్దలుంటారు. వీరు చెప్పిందే తీర్పు. వీరి మాటే శాసనం. ఎవరూ అతిక్రమించరు. ఈ కట్టును దురాయి అంటారు. గొడవలు పడ్డా పోలీసుల దాకా వెళ్లరు.

గౌతమ్ అదానీని అరెస్ట్ చేయాలి

- ఆ అవినీతిలో భాగస్వామి అయిన మాజీ సీఎం జగన్ స్పందించాలి
- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డిమాండ్



తిరుపతి (కలెక్టరేట్), నవంబరు26(ఆంధ్రజ్యోతి): 'అదానీని తక్షణమే అరెస్టు చేయాలి. ఆయనతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలి. ఆయనపై సీబీఐ, ఈడీ దర్యాప్తు జరిపించాలి' అని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు డిమాండు చేశారు. కేంద్ర కార్మిక.. రైతు సంఘాల పిలుపు మేరకు మంగళవారం తిరుపతి కలెక్టరేట్ వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. వీరికి పలు కార్మిక సంఘాలు సంఘీభావంగా ప్రకటించాయి. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ.. గౌతమ్ అదానీతో విద్యుత్ ఒప్పందాలు చేసుకున్న రాష్ట్రాలకు రూ.కోట్లలో లంచం ఇచ్చినట్లు అమెరికాలో కేసు నమోదైందని గుర్తుచేశారు. ఈ అవినీతి భాగస్వామిగా ఉన్న మాజీ సీఎం జగన్ దీనిపై స్పందించాలన్నారు. ఆయనా అవినీతిలో కూరుకుపోయారని పేర్కొన్నారు. దీనిపై కూటమి ప్రభుత్వం మాట్లాడకపోవడం సిగ్గుచేటన్నారు. ఆదానీతో చేసుకున్న ఒప్పందాలను కూటమి ప్రభుత్వం రద్దు చేయాలని కోరారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వకుండా వెట్టిచాకిరీ చేయిస్తున్నారు. కార్మిక, కర్షక ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ, సీఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి, బాలసుబ్రహ్మణ్యం, ఐఎఫ్‌టీయూ నాయకురాలు భారతి డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్వర్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ ఆందోళనలో ఏపీ రైతు సంఘం నేత రామానాయుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, రైతు సంఘాల సమాఖ్య నాయకులు మాంగాటి గోపాల్‌రెడ్డి, వామపక్ష పార్టీ నేతలు రాధాకృష్ణ, విశ్వనాథ్, హేమలత, రవి, లక్ష్మి, జయచంద్ర, సుబ్రహ్మణ్యం, సాయిలక్ష్మి, ఐఎఫ్టీయూ కార్మిక సంఘ నేత వెంకటరత్నంతో పాటు వివిధ కార్మిక సంఘాల నాయకులు, రైతు నాయకులు పాల్గొన్నారు.



ఇళ్లమధ్యలో ఇసుక డంప్

తిరుపతి రూరల్ మండలం గాంధీపురం పంచాయతీ గరుడాద్రినగర్‌లో కొందరు ఇళ్లమధ్యలో ఇసుకను డంప్‌చేసి అనధికారికంగా విక్రయిస్తున్నారు. రోడ్డు పక్కనే చుట్టూ ప్రహరీ ఉన్న ఖాళీ స్థలంలో ఇసుక గుట్ట ఉంది. ఇక్కడ రేయింబవళ్లు ట్రాక్టర్లు, టిప్పర్ల రాకపోకలతో ఇబ్బందిపడుతున్నామని స్థానికులు అంటున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని వాపోతున్నారు.

- తిరుపతిరూరల్, ఆంధ్రజ్యోతి

లాంఛనంగా పాఠశాల రాజ్యాంగం ఆమోదం

శ్రీకాళహస్తి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మండలం ఊరందూరు జడ్పీ ఉన్నత పాఠశాల రాజ్యాంగాన్ని మంగళవారం లాంఛనంగా ఆమోదించారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం జరిగింది. పాఠశాల రాజ్యాంగాన్ని ఇటీవల ఉపాధ్యాయులు, విద్యార్థులు కమిటీగా ఏర్పడి రచించిన విషయం తెలిసిందే.





కమిటీ అధ్యక్షురాలు రాజకుమారి ఆధ్వర్యాన రాజ్యాంగ పరిషత్ సమావేశం

పాఠశాల రాజ్యాంగ పరిషత్ అధ్యక్షురాలిగా హెచ్ఎం రాజకుమారి, రచనా సంఘం ఛైర్మన్‌గా కూనాటి సురేష్, హక్కుల కమిటీ ఛైర్మన్‌గా రమేష్‌బాబు, విధుల కమిటీ ఛైర్మన్‌గా శ్రీనివాసులు, అధికారాల కమిటీ ఛైర్మన్‌గా మురళి, విధి విధానాల ఛైర్మన్‌గా రజియా, మైనార్టీలు, వెనుకబడిన తరగతుల ఛైర్మన్‌గా మల్లికార్జున, ఆర్థిక కమిటీ ఛైర్మన్‌గా శాంతి, ఇతర కమిటీలకు ఛైర్మన్లుగా సుమతి, బిందు తదితరులు వ్యవహించారు. 193మంది విద్యార్థులు రాజ్యాంగ పరిషత్ సభ్యులుగా అలనాటి వస్త్రధారణలో హాజరయ్యారు. ముందుగా అధికారిక లాంఛనాలతో పాఠశాల రాజ్యాంగాన్ని ఆమోదించారు. అనంతరం ప్రధాన కమిటీ సభ్యులు ప్రతులను ఆవిష్కరించారు. ఆ తరువాత భారత రాజ్యాంగ వ్యవస్థపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల రాజ్యాంగంలోని ప్రవేశికను సామూహికంగా ప్రతిజ్ఞ చేశారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించి ప్రోత్సాహక బహుమతులు అందిచారు.

మన రాజ్యాంగం మహోన్నతం

తిరుపతి (కలెక్టరేట్), నవంబరు26(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో కెల్లా మన భారత రాజ్యాంగం మహోన్నతమైనదని కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగ స్ఫూర్తిగా నడుచుకోవాలని, త మార్గదర్శకాల మేరకు అధికారులూ సేవలు అందించాలన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన భారత రాజ్యాంగ ప్రవేశిక ఆమోద దినాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా భారత రాజ్యాంగ నిర్మాణ డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. రాజ్యాంగ ప్రవేశిక చదివి అందరితో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సాల్, డీఆర్వో నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

పంటను తొక్కించేశారు



ఇది 20 రోజుల కిందట నాటిన వరి పంట. చెరువు ఆక్రమిత పొలమని మంగళవారం ట్రాక్టరుతో తొక్కించేశారు. దొరవారిసత్రం మండలం వెదురుపట్టు పంచాయతీ నర్సమాంబపుర ఆగ్రహారం చెరువు సర్వే నెంబరు 43, 44లో ఐదు దశాబ్దాలుగా కొందరు రైతులు 20 ఎకరాల వరకు ఆక్రమించి సాగు చేసుకొంటున్నారు. వీటిని తొలగించాలని తుంగమడుగుకు చెందిన అధికార పార్టీ నాయకుడు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు ట్రాక్టర్‌తో రోటా వేటర్‌తో తొక్కించేశారు. పంట వేయకముందే కట్టడి చేయలేదు. కనీసం పంట దిగుబడి వచ్చేవరకైనా ఆగుంటే బాగుండేదని స్థానికులు అంటున్నారు.

- దొరవారిసత్రం, ఆంధ్రజ్యోతి

మృతదేహం ఆనవాళ్ల లభ్యంపై

పోలీసుల దర్యాప్తు వేగవంతం

పాకాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి మిస్సింగ్ కేసులో ఆరు నెలల తరువాత మృతదేహం ఆనవాళ్లు లభ్యం కావడంపై పాకాల పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. సీఐ కె.మద్దయ్య ఆచారి మంగళవారం క్లూస్ టీం, ఫోరెనిక్స్ నిపుణులు, రెవెన్యూ సిబ్బందితో కలిసి మృతదేహం ఆనవాళ్లు లభ్యమైన ప్రాంతాన్ని పరిశీలించారు. ఉమర్ ఫరూఖ్ అవశేషాలను గుర్తించి ఫోరెనిక్స్ ల్యాబ్‌కు పంపించారు. 'ఉమర్ ఫరూఖ్ మే 4న రాత్రి ఎన్నికల నిమిత్తం లారీలో అక్రమంగా తెచ్చిన మద్యం దింపడానికి మరో ఇద్దరితో కలిసి వెళ్లాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులను చూసి పారిపోయాడు. పంటపల్లె దగ్గర కె.కిరణ్ కుమార్ రెడ్డి భూమిని మోహన్ రెడ్డి లీజుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. మోహన్‌రెడ్డి పందుల కోసం పొలం దగ్గర కరెంటు తీగలను అమర్చాడు. పారిపోతున్న ఫరూఖ్ కాలికి కరెంటు తీగ తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మరుసటిరోజు ఉదయం మోహన్ రెడ్డి పొలంవద్ద ఫరూఖ్ మృతదేహాన్ని గుర్తించి భార్య సాయంతో సమీపంలోనే పూడ్చివేశారు' అని సీఐ వివరించారు. ఐడీ పార్టీ పోలీసుల ద్వారా ఘటన వివరాలు తెలియడంతో ఈ దారుణం వెలుగు చూసింది. మృతదేహాన్ని పూడ్చేసిన మోహన్ రెడ్డిని అదుపులోకి తీసుకొని పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతదేహం ఆనవాళ్లు లభ్యమైన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ మద్దయ్య ఆచారి

బేస్‌బాల్ టోర్నీ విజేతలు ఉమ్మడిజిల్లా బాలబాలికల జట్లు



ట్రోఫీలను అందుకుంటున్న బాలురు, బాలికల జట్లు



తిరుపతి(క్రీడలు), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అండర్ 14 బేస్‌బాల్ విజేతలుగా ఉమ్మడి చిత్తూరుజిల్లా బాలబాలికల జట్లు నిలిచాయి. తిరుపతి శివారు మంగళంలోని ట్రెండ్స్ జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో మూడు రోజులుగా బేస్‌బాల్ పోటీలు జరిగాయి. అత్యుత్తమంగా రాణించిన జట్లను విజేతలుగా ప్రకటించడంతో పాటు 32(బాలురు 16, బాలికలు 16)మంది క్రీడాకారులను జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక చేశారు. మంగళవారం సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో టీడీపీ నేత మబ్బు దేవనారాయణరెడ్డి, ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.బాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేశవులనాయుడు, అనిత్‌కుమార్‌రెడ్డి విజేతలకు ట్రోఫీలు, బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

విజేతల వివరాలిలా

బాలుర విభాగం: ఉమ్మడి చిత్తూరుజిల్లా, విజయనగరం, వైఎస్సార్ కడప మొదటి మూడుస్థానాల్లో నిలిచాయి.

బాలికల విభాగం: తొలి మూడు స్థానాలను ఉమ్మడి చిత్తూరు జిల్లా, శ్రీకాకుళం, వైఎస్సార్ కడప జట్లు సాధించాయి.

జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన వారు

బాలుర విభాగం: నవీన్‌కుమార్, కార్తీక్, అజిత్, తౌఫిక్(చిత్తూరు), పవన్, జోయల్, మోహన్‌కృష్ణ(విజయనగరం), బి.సంతోష్, ఎం.సంతోష్, కైఫ్(కడప), జస్వంత్(కృష్ణా), తులసీరాజ్(వైజాగ్), లోహిత్(అనంతపురం), వంశీ(శ్రీకాకుళం), చైతన్య(ప్రకాశం), వంశీ(కర్నూల్), స్టాండ్ బైగా గుణశ్యామ్(చిత్తూరు), జీవన్(వైజాగ్), హరినాథ్(కడప), గౌతం(విజయనగరం).

బాలికల విభాగం: రమ్య, శ్రీభవ్య, శ్రీహిమజ, నిరోష(చిత్తూరు), వినయలక్ష్మి, హరిణి, జీవిత(శ్రీకాకుళం), తనుజ, వైష్ణవి(కడప), మౌనిక(విజయనగరం), గాయత్రి(కృష్ణ), భూమి(గుంటూరు), హేమ(ఈ.గోదావరి), లావణ్య(అనంతపురం), అక్షయ(కర్నూల్), దీక్షిత(చిత్తూరు), స్టాండ్‌బైగా నాగశరణ్య(కడప), జయప్రసన్న(చిత్తూరు), రమ్య(విజయనగరం), కీర్తి(శ్రీకాకుళం).

వ్యాను, బస్సు ఢీ : 15మందికి గాయాలు





చికిత్స పొందుతున్న ఆంజనేయులు నాయక్, నవీన్



బాలుడిని చికిత్సకు తరలిస్తున్న దృశ్యం



దెబ్బతిన్న వ్యాను

శ్రీకాళహస్తి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో 15మంది గాయపడ్డారు. ఈ ఘటన మంగళవారం వేకువజామున తొట్టంబేడు మండలం జ్ఞానాంబ కండ్రిగ సమీపంలోని నాయుడుపేట-రేణిగుంట జాతీయ రహదారిపై జరిగింది. శ్రీకాళహస్తి రెండో పట్టణ సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన ప్రకారం.. పల్నాడు జిల్లా రెంటచింతల మండలం మల్లవరానికి చెందిన శ్రీనునాయక్ వ్యాపారి. ఆయన కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు సోమవారం వ్యానులో బయలుదేరారు. జ్ఞానాంబ కండ్రిగ వద్ద బెంగళూరు నుంచి నాయుడుపేట వైపుగా వెళుతున్న టూరిస్టు బస్సు, వ్యాను ఢీకొన్నాయి. ఈ ఘటనలో వ్యానులో ప్రయాణిస్తున్న శ్రీనునాయక్, శ్రీరాములు, వెంకటేశ్వర్లు, సోమ్లు, సైదా, సంజు, జాను, ఆంజనేయులు, దద్దు, జశ్వంత్, మంజుల, రూప, నీల, వెంకటేశ్వర్లు, నవీన్ తదితరులు గాయపడ్డారు. ఇందులో ఆంజనేయులు ఎడమకన్నుకు తీవ్రగాయమైంది. ప్రథమ చికిత్స అనంతరం క్షతగాత్రులు తిరుపతి రుయాకు తరలివెళ్లారు. కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. అందరూ గాయాలతో బయటపడటంతో పెనుముప్పు తప్పిందని ఊపిరి పీల్చుకున్నారు.



12 అడుగుల కొండ చిలువ

కేవీబీపురం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కేవీబీపురం మండలం మారప్పరెడ్డి కండ్రిగ చెక్‌పోస్టు వద్ద మంగళవారం రాత్రి 12 అడుగుల కొండచిలువ కనిపించింది. ఆ సమయంలో విధుల్లో ఉన్న భోగరాజు, రఘుపతి దానిని చాకచక్యంగా పట్టుకుని సమీపంలోని అటవీప్రాంతంతో వదలిపెట్టారు.

ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు ఊరట

పెన్షన్లలో కమ్యుటేషన్ రికవరీల ఆపివేతపై ఉత్తర్వులు

పుత్తూరు,నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విశ్రాంత ఉద్యోగులకు ఊరట లభించింది.కమ్యుటేషన్ల రికవరీ కాలం 11 సంవత్సరాల మూడు నెలలు పూర్తయితే పెన్షన్లలో నవంబరు నెల నుంచి రికవరీని ఆపివేయాలని ప్రభుత్వం ఆదేశాలను జారీ చేసింది.గతంలో నిర్ణయించిన 15ఏళ్ల కాలంలో కమ్యుటేషన్ రికవరీలపై విశ్రాంత ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించి ఇంటీరియమ్ ఉత్తర్వులను పొందారు.1980లో బేసిక్ పెన్షన్‌లో 10.7 శాతానికి సమానంగా 40శాతం మొత్తాన్ని రిటైరయ్యే సమయంలో తీసుకుని 15 ఏళ్లలో ప్రభుత్వానికి చెల్లించేవారు. అయితే 2010లో 9వ పే కమిషన్ భారీగా జీతాలను పెంచడంతో బేసిక్ పెన్షన్‌లో 8.4 శాతానికి తగ్గించి ఆ మేరకు 40 శాతం మొత్తాన్ని విశ్రాంత ఉద్యోగులకు కమ్యుటేషన్ మొత్తాలను అందించారు. ఇదే సమయంలో రిజర్వు బ్యాంకు వడ్డీ రేట్లను 12 శాతం నుంచి 7 శాతానికి తగ్గించింది. మరో పక్క 1980లో మనిషి సగటు జీవిత కాలం 57 ఏళ్లు కాగా 2010లో 72 ఏళ్లకు పెరిగింది. ప్రభుత్వ నిబంధనల మేరకు విశ్రాంత ఉద్యోగి 15 ఏళ్ల చెల్లింపు మధ్యలో చనిపోతే రికవరీ పూర్తిగా రద్దవుతుంది. సగటు వయస్సు పెరగడం వల్ల ప్రభుత్వానికి విశ్రాంత ఉద్యోగి చెల్లింపులో 99 శాతం నష్టం జరిగే అవకాశం తగ్గిపోయింది. ఈ మూడు అంశాలను విశ్రాంత ఉద్యోగులు హైకోర్టు ముందుంచగలిగారు.ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించి రికవరీని నిలిపివేయాలని ఆదేశాలను జారీ చేసింది. విద్యుత్ సంస్థ విశ్రాంత ఉద్యోగులు కూడా ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా తమ రికవరీలను ఆపాలని కోరుతున్నారు.



పట్టుబడిన నాగుపాము

తిరుమల, నవంబరు26(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని టీటీడీ ఆఫీసర్స్ క్వార్టర్స్ వద్ద మంగళవారం ఓ నాగుపాము పట్టుబడింది. టీటైప్ క్వార్టర్స్‌లో టీటీడీలోని వివిధ విభాగాల అధికారులు నివసిస్తుంటారు. మంగళవారం ఉదయం సుమారు ఆరు అడుగుల నాగుపాము 23వ నెంబరు గల ఇంట్లోకి వెళ్లి.. కొద్ది సమయానికే వెలుపలకు వచ్చేసింది. ఆ సమయంలో ఇంట్లో ఉన్న మహిళలు భయంతో బయటకు వచ్చి టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర్‌నాయుడికి సమాచారమిచ్చారు. పట్టుబడిన నాగుపాము మరో పిల్లపామును మింగేసినట్టు భాస్కర్‌నాయుడు తెలిపారు. ఆ పామును దట్టమైన అడవిలో విడిచిపెట్టాడు.

తిరుమల పవిత్రత పెంపొందేలా పనిచేయండి

- భానుప్రకాష్‌రెడ్డికి వెంకయ్య నాయుడి సూచన



తిరుపతి(ఉపాధ్యాయనగర్), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తిరుమల ప్రతిష్ఠ మరింతగా పెంపొందేలా పనిచేయాలని టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డికి మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు సూచించారు. చెన్నై రాజ్‌భవన్‌లో మంగళవారం భానుప్రకాష్‌రెడ్డి ఆయన్ను కలిశారు. శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా కల్తీ నెయ్యి తదితర అంశాలను వెంకయ్య నాయుడు ఆరా తీసినట్లు తెలిపారు. తిరుమల పవిత్రతను కాపాడుతూ మంచి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

జాతీయ రహదారిపై స్తంభించిన ట్రాఫిక్



జాతీయ రహదారిపై నిలిచి ఉన్న వాహనాలు

నాయుడుపేట టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - చెన్నై రహదారిపై మంగళవారం ఉదయం సుమారు గంటపాటు ట్రాఫిక్ స్తంభించి పోయింది. ఓ లారీ మరమ్మతులకు గురవడంతో కావడంతో రహదారిపై ఆగి పోయింది. దీంతో రహదారికి రెండు వైపులా భారీగా వాహనాలు నిలిచి పోయాయి. సమాచారం తెలుసుకున్న హైవే మొబైల్ సిబ్బంది, పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు చర్యలు చేపట్టారు. ఓ వైపు జోరున కురుస్తున్న వానలో జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బందులకు గురయ్యారు.

విద్యుత్ తీగలు తెగిపడి ఆరు గేదెల మృతి



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన గేదెలు

కోట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగలు తెగిపడి ఆరు గేదెలు మృతి చెందిన ఘటన కోట మండలం గూడలి ఉన్నత పాఠశాల సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. గూడలి ఉన్నత పాఠశాల సమీపంలో ఆర్ అండ్‌బీ రోడ్డు ప్యాచ్ వర్కులు చేస్తున్నారు. ఈ పనుల కోసం వచ్చిన కంకర్ తీసుకువచ్చిన టిప్పర్ వెనుకభాగం విద్యుత్ లైన్‌కు తగలడంతో తీగలు తెగిపోయాయి. అదే సమయంలో గూడలి అరుంధతీయవాడకు చెందిన పారిచర్ల వెంకటనరసయ్య కుమార్తె మేతకోసం గేదెలను స్వర్ణముఖినదిలోకి తోలుకెళ్తుండగా వాటిమీద విద్యుత్ తీగలు పడ్డాయి. దీంతో ఆరు గేదెలు అక్కడిక్కడే మృతి చెందాయి. టిప్పర్ డ్రైవర్ బయటకు దూకేసి ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. గేదెలను తోలుకెళ్తున్న బాలిక దూరంగా పరిగెత్తి ప్రాణాపాయం నుంచి బయటపడింది. స్థానికులు వెంటనే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. సుమారు రూ.4 లక్షల విలువచేసే గేదెలు చనిపోవడంతో రైతు వెంకట నరసయ్య తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు.

'ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటాం'



బైక్ ర్యాలీ చేస్తున్న వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు

కోట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను అడ్డుకునేందుకు ప్రాణాలర్పించేందుకు లక్షలాదిమంది మాలలు సిద్ధంగా ఉన్నారని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాటసమితి నాయకులు అన్నారు. కోట పట్టణంలో మంగళవారం ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కోట క్రాస్‌రోడ్డులోని నెహ్రూ విగ్రహం నుంచి బజారుసెంటర్‌లో ఉన్న గాంధీబొమ్మ సెంటర్, ఆర్టీసీ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాటసమితి ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు మీజూరు మాధవ్, డాక్టర్ రామకృష్ణారావు, దాసరి సుందరం, పాలా మల్లికార్జున్‌రావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీలలో చిచ్చు పెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని మండిపడ్డారు. ఎస్సీ వర్గీకరణ ప్రయత్నాలను తిప్పికొడుతామన్నారు. కార్యక్రమంలో వెంకట రమణయ్య, హేమంత్, వెంకటకృష్ణయ్య, శ్రీనివాసులు, చిరంజీవి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి

సూళ్లూరుపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కార్మిక, కర్షక, ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద కార్మిక సంఘ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘ నాయకులు అల్లెయ్య మాట్లాడుతూ కార్మికులకు సమాన పనికి సమాన వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ ఏవో రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు లక్ష్మయ్య, చంద్రశేఖర్, సుధాకర్, మునెయ్య, సాంబశివయ్య, పద్మనాభం, ఫయాజ్, జయకుమార్, మధు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి



మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ అధికారులు

గూడూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ఎక్సైజ్ సీఐ కరీమాబేగం అన్నారు. మంగళవారం స్థానిక స్వర్ణాంధ్రభారతి జూనియర్ కళాశాల, ఐటీఐ కళాశాలలోని విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గంజాయి, గుట్కా, పొగాకు వంటి మత్తుపదార్థాలకు యువత దూరంగా ఉంటూ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. మత్తు పదార్థాలకు బానిసలైతే జీవితాలు నాశనమవుతాయనిన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలను వినియోగించినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో బాలకృష్ణ, శేషమ్మ, వేణుగోపాల్, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

భూ ఆక్రమణ ఆపివేత

బాలాయపల్లి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కడగుంట గ్రామం సర్వే నంబరు 268లో వివాదాస్పదంగా ఉన్న ప్రభుత్వ భూమిని అదే గ్రామానికి చెందిన కొందరు ఆక్రమించి ఎక్స్‌కవేటర్ సాయంతో చదును చేస్తుండగా రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. ప్రభుత్వ భూమిని చదును చేస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులుకు సమాచారం అందడంతో ఆయన ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది, పోలీసులు వెళ్లి ఆక్రమణలను అడ్డుకున్నారు. ప్రభుత్వ భూమిలోకి ప్రవేశిస్తే చర్యలు తీసుకుంటామని బోర్డు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీకాంత్, పోలీసులు పాల్గొన్నారు.

మోటర్ సైకిళ్ల చోరీ

సూళ్లూరుపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలో మోటర్ సైకిళ్ల చోరీలు అధికమయ్యాయి. హోటళ్లు, దుకాణాలు, బ్యాంకులు, ఇళ్ల ముందు నిలిపిన బైక్‌లు మాయమైపోతున్నాయి. మూడు రోజుల క్రితం రైల్వేస్టేషన్ వద్ద పార్క్ చేసిన కోనేరు కిరణ్, జి.వెంకటేశ్వర్లుకు చెందిన రెండు బైకులు చోరీ అయ్యాయి. అలాగే హనుమాన్‌వీధిలో ఎస్ఎస్ డయాగ్నోస్టిక్ సెంటర్ పక్కన ఓ టిఫిన్ సెంటర్ వద్ద పార్క్ చేసిన శ్రీనివాస్‌కు చెందిన బైక్ చోరీకి గురైంది. బాధితులు పోలీసులు ఫిర్యాదు చేశారు.

సకాలంలో నిత్యావసర సరుకులు అందించాలి

చిట్టమూరు, నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి) చౌక దుకాణ డీలర్లు ఎండీయూల ద్వారా సకాలంలో నిత్యావసర సరుకులు అందించాలని తహసీల్దారు ప్రసాద్ తెలిపారు. మంగళవారం చౌక దుకాణదారులు, ఎండీయూ నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రతి నెలా ఒకటో తారీఖున సరుకులు పంపిణీ చేయాలని సూచించారు.



వైల్డ్ లైఫ్, సీలింగ్ భూముల్లో తవ్విన చెరువు - అంక్షలున్న ప్రాంతంలో నాటిన విద్యుత్ స్తంభాలు

వైల్డ్‌లైఫ్ ఏరియాలో చెరువు తవ్వకం

నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ స్తంభాల ఏర్పాటు

చిట్టమూరు, నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో అధికారమే అండగా చెలరేగిపోయిన అక్రమార్కులు యథేచ్ఛగా ఆక్రమణలకు పాల్పడ్డారు. పోరంబోకు, మేత భూములు, గ్రామ కంఠాలు, అటవీ భూములు... ఇలా కనిపించిన చోటల్లా వాలిపోయి చెరబట్టారు. ఇదేవిధంగా చిట్టమూరు మండలంలోని పక్షుల రక్షిత ప్రాంతాన్ని ఓ నేత వదల్లేదు. చిట్టమూరు మండలంలో తీరప్రాంత గ్రామమైన కుమ్మరిపాళెంలో 140 ఎకరాలను కోట మండలానికి చెందిన ఓ వైసీపీ నాయకుడు కొనుగోలు చేశాడు. పక్కనే సర్వే నెంబర్ 2లో సెటిల్‌మెంట్ భూమితో పాటు ల్యాండ్ సీలింగ్ భూమి ఉంది. ఇదే ప్రాంతంలో సర్వే నెంబరు 1లో వందల ఎకరాల వైల్డ్ లైఫ్ ఏరియా ఉంది. వన్యప్రాణుల రక్షిత ప్రాంతంలో నింబంధనలకు తూట్లు పొడిచిన వైసీపీ నాయకుడు భారీ ఎక్స్‌వేటర్లు పెట్టి చెరువును తవ్వేశాడు. అప్పట్లో కుమ్మరిపాళెంవాసులు తిరుగుబాటు చేయడంతో ఆక్రమణదారుడు తనకున్న పలుకుబడితో అధికారుల సాయంతో గ్రామస్తులను భయభ్రాంతులకు గురిచేశాడు. అధికారులకు ఫిర్యాదు చేయగా వైల్డ్ లైఫ్ ఫారెస్టు రేంజర్ వచ్చి చెరువు కట్టను తొలగిస్తున్నట్లు హడావిడి చేసి వెళ్లిపోయారని గ్రామస్తులు ఆరోపించారు. అంతేకాకుండా వైల్డ్‌లైఫ్ ఏరియాలో నిబంధనలకు విరుద్ధంగా రెండు కిలో మీటర్లు విద్యుత్ స్తంభాలు నాటించాడు. సుమారు మూడు గ్రామాల ప్రజలు నడిచే రోడ్డుపై తట్టెడు మట్టి వేసినా పక్షుల రక్షిత ప్రాంతమంటూ అడ్డుకొనే అధికారులు అక్రమంగా చెరువు తవ్వడమే కాకుండా విద్యుత్ స్తంభాలు నాటినా పట్టించుకోకపోవడం పట్ల కుమ్మరిపాళెంవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రాజ్యాంగ హక్కులను సద్వినియోగం చేసుకోండి



గూడూరులో ప్రతిజ్ఞ చేస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది - నాయుడుపేటలో మాట్లాడుతున్న న్యాయమూర్తి సంయుక్త

గూడూరు అర్బన్, నాయుడుపేట టౌన్, పెళ్లకూరు, చిల్లకూరు, కోట, వాకాడు, సూళ్లూరుపేట, ఓజిలి, చిట్టమూరు, నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఏడవ అదనపు జిల్లా జడ్జి షమ్మీపర్వీన్ సుల్తానాబేగం అన్నారు. మంగళవారం గూడూరు కోర్టు ఆవరణలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. రాజ్యాంగ విలువలను కాపాడతామని సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ రాజ్యాంగం ప్రతి పౌరుడికీ ప్రాథమిక హక్కులను కల్పించడం జరిగిందన్నారు. వీటిపై ప్రజలు అవగాహన పెంచుకుని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు రాజేష్, సులోచనరాణి, లోకనాథం, శంకరయ్య, ఏవో పద్మావతి, న్యాయవాదులు లక్ష్మీనారాయణ, అరవ పార్వతయ్య, మహబూబ్‌బాషా, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు. ● నాయుడుపేటలోని సాంఘిక సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. జూనియర్ సివిల్ జడ్జి సంయుక్త మాట్లాడుతూ విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. లోకజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి, మంచి ఆలోచనల కోసం మాత్రమే సెల్‌ఫోన్లను వినియోగించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పసల గంగాప్రసాద్, న్యాయవాదులు సురేష్, సునీల్, సుధీర్‌రెడ్డి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు. ● పెళ్లకూరు మండల కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఎంపీడీవో ప్రమీలారాణి నివాళులర్పించారు. ● చిల్లకూరు మండలంలోని పారిచెర్లవారిపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి ఎంఈవో సనత్ కుమార్, ఉపాధ్యాయులు నివాళులర్పించారు. విద్యార్థులచే రాజ్యాంగ పీఠిక చదివించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెచ్ఎం సుధాకర్, చంద్ర, చంద్రశేఖర్, వీవీ కుమార్, విద్యులత, ప్రజేంద్రరెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. ● కోట ఆర్టీసీ సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి అన్‌బిన్ సువడగల్ సంస్థ డైరెక్టర్ భూపతి మోహన్‌సాయి, భూపతి పోలయ్య, కర్లపూడి సుధాకర్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ● వాకాడు మండల కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఎంపీడీవో అన్నపూర్ణరావు నివాళులర్పించారు. ● సూళ్లూరుపేట వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బీ శంకరశర్మ, వైస్ ప్రిన్సిపాల్ విక్టోరియా రాణి, అధ్యాపకులు ఉషారాణి, గౌరీ శంకర్, సునీత, శరత్ బాబు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ● ఓజిలి మండల పరిషత్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యాలయ సీనియర్ సహాయకు రాలు ప్రసూన్న, ఏపీవో ఉషారాణి, సిబ్బంది పాల్గొన్నారు. ● చిట్టమూరు మండల పరిషత్ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి ఎంపీడీవో మనోహర్ గౌడ్ నివాళులర్పించారు. ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి నిబంధనలపై విద్యార్థులు అవగాహన కలిగివుండాలి



రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న రవాణాశాఖ అధికారులు

గూడూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రోడ్డు నిబంధనలపై విద్యార్థులు అవగాహన కలిగివుండాలని ఆర్టీవో బీఎస్‌కే కిషోర్ అన్నారు. మంగళవారం స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలను నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎంవీఐ ప్రభాకర్, కళాశాల డైరెక్టర్ డాక్టర్ దత్తాత్రేయ, ప్రిన్సిపాల్ డాక్టర్ రవిప్రసాద్, కోటేశ్వరరావు, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

3న అయ్యప్పస్వామి జ్యోతి పూజ

నాయుడుపేట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణంలోని అయ్యప్పస్వామి దేవస్థానంలో వచ్చే నెల 3వ తేదీన జ్యోతి పూజోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. జ్యోతి పూజోత్సవం సందర్భంగా గణపతిహోమం, పంచ వైద్యాలతో కర్పూరజ్యోతి, వీరనృత్యాలు, అమ్మవారి వేషధారణలు, తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కామిరెడ్డి రాజారెడ్డి, కృష్ణారెడ్డి, సంజాయ్, మునిరాజ, అంకయ్య, చదలవాడ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్ బాధితులకు సాయం



బాధితులకు బట్టలు అందిస్తున్న ఎంపీడీవో అన్నపూర్ణరావు

వాకాడు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావిగుంటపాళెం పంచాయతీ తీపలపూడి గ్రామానికి చెందిన బల్లి ప్రసాద్, కృష్ణమ్మ దంపతుల పూరిల్లు షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయింది. మంగళవారం ఆ కుటుంబానికి ఎంపీడీవో అన్నపూర్ణరావు వంట సామగ్రి, బట్టలు, 10వ తరగతి చదువుతున్న వారి కుమారుడికి పాఠ్య పుస్తకాలు, ఏడాది కాలనికి బస్సు పాసు అందజేశారు.

వీధి లైట్లు ఏర్పాటు అమర్చండి

గూడూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు గ్రామంలోని ముస్లిం వీధిలో గత కొద్దిరోజులుగా వీధిదీపాలు వెలగకపోవడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. సాయంత్రం 6గంటలు దాటితే వీధిదీపాలు లేక చీకట్లో రాకపోకలు సాగించాలంటే ఇబ్బందులు పడాల్సివస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు అధికారులకు చెప్పినా పట్టించు కోవడం, ఇప్పటికైన స్పందించి ముస్లిం వీధిలో లైట్లు అమర్చాలని కోరుతున్నారు.

చిరుజల్లులు

వెంకటగిరి టౌన్, ఓజిలి, దొరవారిసత్రం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడి అల్పపీడనం కారణంగా వెంకటగిరి పట్టణంలో మంగళవారం ఉదయం నుంచి చిరు జల్లులు పడ్డాయి. పట్టణంలో వీధులను పొగ మంచు కప్పేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ● ఓజిలి మండలంలో మంగళవారం అర్ధరాత్రి నుంచి జల్లులతో కూడిన వర్షం పడుతూనే ఉంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మబ్బులు కమ్మి చలుగాలులు వీస్తున్నాయి. మండలంలో మంగళవారం కురిసిన వర్షం ఎల్డి పైర్లకు మేలుచేస్తుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ● దొరవారిసత్రం మండల పరిధిలోని మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు చిరు జల్లులు పడ్డాయి. ముసురు వాతావరణం నెలకొనడంతో పాటు చలిగాలులు వీచాయి.

రైతులకు, కార్మిక సంఘాలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి



ఎల్ఐసీ ఉద్యోగుల యూనియన్ నాయకుల నిరసన

గూడూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ రైతులకు, కార్మిక సంఘాలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం గూడూరు బ్రాంచ్ అధ్యక్షుడు విజయ భాస్కర్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఎల్ఐసీ కార్యాలయం వద్ద భోజన విరామ సమయంలో ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగేళ్ల క్రితం ఢిల్లీలో రైతులు ఉద్యమం చేపట్టిన సమయంలో ప్రధాని నరేంద్రమోదీ పలు హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పటి వరకు హామీలను అమలు చేయలేదన్నారు. రైతులకు రుణమాఫీ, కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు, పెన్షన్ రూ.10వేలు అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాగరాజు, మెహబూబ్‌బాషా, శేఖర్‌రెడ్డి, శివకుమార్, అశోక్‌కుమార్, విజయ్‌కుమార్, మీరాసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలపై దృష్టి సారించండి

వెంకటగిరి టౌన్, నవంబరు 26,(ఆంధ్రజ్యోతి): రైతులు ఉద్యాన పంటలపై దృష్టి సారించాలని ఏడీఏ నాగర్జున సాగర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సోమసానిగుంట, టీబీ పల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీలో వరి సాగు చేసే రైతులు 23 రోజులు నారును ఎక్కువ పిలకలు పెట్టి దగ్గర దగ్గరగా నాటడం వల్ల మంచి దిగుబడి పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త విజయశ్రీ, కిషోర్, రామ్మోహన్ రావు, కృష్ణ, సుమ, మహేంద్ర, రైతులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ నాగర్జున సాగర్

తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

సూళ్లూరుపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో తుఫాన్ కారణంగా 27, 28 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో కిరణ్మయి సూచించారు. ఆర్డీవో కార్యాలయంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, అధికారులు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. 27, 28 తేదీల్లో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదన్నారు.

ముందస్తు చర్యలపై దిశానిర్దేశం

పెళ్లకూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో మూడు రోజులు పాటు భారీ వర్షాలు కురిసే అవ కాశం ఉన్న నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపట్టినట్లు తహసీల్దార్ ద్వారకానాథరెడ్డి తెలిపారు. మంగళవారం రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించి ముందస్తు చర్యలపై దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ యువరాజు, వీఆర్వోలు రమేష్, వంశీకృష్ణ, సుధాకర్, స్వామి, తేజ, మోబీనా తదితరులు పాల్గొన్నారు.

పులికాట్‌లో ఒడ్డుకు చేరిన పడవలు

సూళ్లూరుపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడ్డ తుఫాన్ ప్రభావంతో మంగళవారం ఉదయం నుంచే ముసురు వేసుకొని చిరు జల్లులతో కూడిన వర్షం కురిసింది. కారుమబ్బులు కమ్ముకొని చలుగాలులు వీయడంతో పులికాట్ సరస్సులో వేటకు వెళ్లిన మత్స్యకారులు పడవలు తీసుకొని ఒడ్డుకు చేరుతున్నారు. 27, 28 తేదీలో భారీ వర్షం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో పులికాట్‌లో వేటకు వెళ్లరాదని అధికారులు చెప్పడంతో మత్స్యకారులు పడవలను ఒడ్డుకు చేర్చి ఇళ్లకు చేరుకుంటున్నారు.

గూడూరు - తిరుమల సర్వీసుల ఏర్పాటుకు కృషి



గూడూరు - తిరుపతి బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాశిం

గూడూరు అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గూడూరు - తిరుమల మధ్య బస్సు సర్వీసుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ డిపోలో గూడూరు - తిరుపతి బస్సు సర్వీసును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో గూడూరు నుంచి తిరుమలకు బస్సులు నడిచేవని, గత వైసీపీ అధికారంలోకి వచ్చిన ఆ సర్వీసులను నిలిపివేయడం జగిందన్నారు. ఉత్తరాది ప్రాంతాల నుంచి వచ్చే ఎంతోమంది భక్తులు గూడూరు రైల్వే స్టేషన్‌లో దిగి తిరుమలకు బస్సుల్లో వెళ్లేవారన్నారు. భక్తుల సౌకర్యార్థ కోసం గూడూరు నుంచి తిరుమలకు బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని రవాణ శాఖ మంత్రిని కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. త్వరలోనే గూడూరు - తిరుమల బస్సు సర్వీసులను ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం డిపో ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు శీలం కిరణ్‌కుమార్, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, జగన్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్టేడియంలో సిమెంటు బెంచీల ఏర్పాటు

గూడూరు అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏఆర్‌డీ ప్రభుత్వ స్టేడియంలో మంగళవారం రత్నాకర్‌రెడ్డి, ప్రభాకర్‌రావు, బాలయ్య, రాఘవులు సహకారంతో వాకర్స్ క్రీడాకారులు సౌకర్యం కోసం వాకర్స్ హెల్త్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నాలుగు సిమెంటు బెంచీలను ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ప్రారంభించారు. ఇటీవల జరిగిన శాసనసభ సమావేశాల్లో గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరులో కలపాలని ఎమ్మెల్యే కోరినందుకు హర్షిస్తూ వాకర్స్ హెల్త్‌క్లబ్ సభ్యులు, పలువురు క్రీడారులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్టేడియంలో ప్రత్యేక గ్యాలరీ, ప్రహరీ మరమ్మతులకు చర్యలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో వేగూరు రాజేంద్ర ప్రసాద్, వసంత్‌కుమార్, శర్మ, వెంకటేశ్వర్లు, రత్నాకర్‌రెడ్డి, బొడ్డు కృష్ణయ్య, సురేష్, విజయ్, కోటేశ్వరరావు, పురుషోత్తం, మస్తాన్, మునీష్ సందీప్, రాజా తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సునీల్‌కు విద్యార్థుల కృతజ్ఞతలు



బస్సు వద్ద చంద్రశేఖరపురం గ్రామస్తులు, విద్యార్థులు

కోట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలి పంచాయతీ చంద్రశేఖరపురంలోని విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించిన ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌కు గ్రామస్థులు, విద్యార్థులు మంగళవారం కృతజ్ఞతలు తెలిపారు. చంద్రశేఖరపురం గ్రామానికి చెందిన 50మందికి పైగా విద్యార్థులు చిట్టమూరు మండలం మెట్టు ఉన్నత పాఠశాలలో చదువుతున్నారు. వీరంతా చంద్రశేఖరపురం నుంచి విద్యానగర్‌కు చేరుకొని, అక్కడ నుంచి ఆటోలు, బస్సుల్లో మెట్టుకు వెళ్లాల్సి వస్తోంది. మూడేళ్లుగా ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తమ సమస్యలను ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌కు వివరించారు. ఎమ్మెల్యే స్పందించి వాకాడు డిపో మేనేజరుతో మాట్లాడి చంద్రశేఖరపురం విద్యార్థుల కోసం ఉదయం, సాయంత్రం బస్సు సర్వీస్ నడిపేలా చర్యలు తీసుకున్నారు. ఇన్నాళ్లకు తమ కష్టాలు తీరాయంటూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు టీడీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మస్తాన్‌బాషా ఆధ్వర్యంలో మంగళవారం బస్సుకు పూజలు చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.